# గొప్ప పరివర్తన

## ఫిలేమోను పత్రిక సంగ్రహ సారాంశం

**A. ఉపోద్ఘాతం :**

ఫిలేమోనుకు వ్రాయబడిన పత్రిక ఒకే అధ్యాయం అయినా, లేఖనాలలో పేర్కొనదగినది. ఈ పత్రిక ఫిలేమోను అనే వ్యక్తికి, వ్యక్తిగతంగా వ్రాయబడినా, అది విశ్వాసులందరికీ ఉపయోగకరమైనది గనుకనే బైబిలులో పొందుపర్చబడడానికి పరిశుద్ధాత్మ అనుమతించాడు.

**I. పత్రికలోని వ్యక్తులు :**

1. **ఫిలేమోను :** ఇతడు కొలస్సీ పట్టణం (ప్రస్తుతం టర్కీ) లో నివసించేవాడు. ఇతడు ధనవంతుడు. పౌలు ఎఫెసులోని తురన్ను పాఠశాలలో రెండు సంవత్సరాలు బోధించిన కాలంలో, అతని వాక్యాన్ని విన్నవారిలో ఫిలేమోను ఒకడైయుండవచ్చును. అతడు పౌలు బోధల ద్వారా రక్షించబడ్డాడు.

2. **ఒనేసీము :** ఫిలేమోనుకు ఒనేసీము అనే దాసుడు ఉన్నాడు. ఇతడు ఒకానొక దినాన అవకాశం చూచుకొని బానిసత్వం నుండి స్వేచ్ఛను పొందాలని, ఫిలేమోను ఇంటిలో నుండి పారిపోయాడు. తనను ఎవరూ గుర్తించరనుకొని రోమా పట్టణానికి వెళ్ళాడు. బానిసత్వంలో ఉన్న స్వేచ్ఛ ఎలాంటిదో, స్వేచ్ఛలో ఉన్న బానిసత్వం ఎలాంటిదో అక్కడికి వెళ్ళాక గాని గుర్తించగలిగాడు. అతడు బానిసగా ఉన్నప్పుడు, తన నిత్యావసరాలను గూర్చి యజమానే బాధ్యత వహించాడు. ఇప్పుడవన్నీ సమస్యగా మారాయి.

3. **అప్ఫియా :** ఈమె బహుశా ఫిలేమోను భార్య అయి ఉండవచ్చును. అప్ఫియా ఫ్రుగియ దేశస్తురాలు. ఆమె కూడ రక్షించబడింది.

4. **అర్ఖిప్పు :** ఇతడు బహుశా ఫిలేమోను కుమారుడు కావొచ్చు. కొలస్సీ పట్టణంలో, ఫిలేమోను గృహంలో కూడుకొనే సంఘానికి ఎపఫ్రా కాపరిగా ఉన్నాడు. అతడు లేని సమయంలో అర్ఖిప్పు ఆ బాధ్యతను చేపట్టినట్లు కొలస్సీ 4:17లో వ్రాయబడింది.

**II. పత్రిక వ్రాయబడిన సందర్భం :**

రోమా పట్టణంలో ఒనేసీము పౌలును కలుసుకోవడం తటస్థించింది. ఆ సమయంలో పౌలు బంధకాలలో ఉన్నాడు. అతడు బంధించబడి ఉన్నా స్వేచ్ఛగా వాక్యాన్ని బోధిస్తున్నాడు. పౌలు బోధను విన్న ఒనేసీము రక్షించబడ్డాడు. భౌతికంగా స్వేచ్ఛను కోరిన తాను ఆధ్యాత్మికంగా బంధకాలలోనే ఉన్నానని గ్రహించగలిగాడు. ఆధ్యాత్మిక స్వేచ్ఛను పొందాక తన తప్పును సరిచేసుకోవడం ద్వారా ఆ స్వేచ్ఛలో ఉన్న ఆనందాన్ని పొందాలనుకొన్నాడు. కనుక తన యజమానియైన ఫిలేమోను వద్దకు తిరిగి వెళ్ళాలనుకొనప్పుడు, అతని గూర్చి సిఫారసు చేస్తూ పౌలు ఈ పత్రికను వ్రాసాడు.

**III. ముఖ్యాంశం :**

మన పట్ల క్రీస్తు ప్రేమ యొక్క ప్రత్యక్షత మరియు సహోదరుల పట్ల మన ప్రేమను ఆచరణలో చూపించుట. క్రీస్తు మనల్ని ప్రేమించాడు గనుక మనందరి పాపాన్ని భరించడానికి ఇష్టపడ్డాడు. మరణం విషయం మన స్థానాన్ని ఆయన తీసుకొన్నాడు.

జీవం విషయం, ఆయన స్థానాన్ని మనకిచ్చాడు. దేవుడు క్రీస్తును చేర్చుకొన్నట్లే మనల్ని చేర్చుకొన్న రీతిగా, ఫిలేమోను పౌలును చేర్చుకొన్నట్లు ఒనేసీమును కూడా చేర్చుకోవాలని పౌలు విన్నవించాడు.

## B. అంశాల వారిగా సంక్షిప్త వివరణ :

**I. ఫిలేమోను గూర్చి పౌలు సాక్ష్యం :** పౌలు నిత్యము ప్రార్థించే వారి జాబితాలో ఫిలేమోను కూడ ఉన్నాడు (1:4) దీన్ని బట్టి అతడు ప్రాముఖ్యమైన వ్యక్తి అని అర్థమౌతుంది. పౌలు ఆత్మీయ స్నేహితునిగా ఇతడు కూడా పౌలు కొరకు ప్రార్థించేవాడు. ఇతడు ధనవంతుడు గనుక ఆర్థికంగా కూడ సహాయం చేసి ఉండవచ్చు. కుటుంబంలో కూడ అతని పాత్రను సమర్థవంతగా నిర్వర్తించాడు. విశ్వాసిగా మాదిరికరమైన జీవితం (1:5) పరిశుద్ధుల పట్ల ప్రేమ గలవాడు (1:6,7). అతని గృహం ఆతిథ్యమిచ్చే గృహంగా, ఆరాధనా కేంద్రంగా ఉండినది.

**2. ఒనేసీము గత మరియు ప్రస్తుత స్థితి :** "ఒనేసీము" అన్న పేరుకు "ప్రయోజకుడు" అని అర్థం. ఒకప్పుడు తన పేరుకు వ్యతిరేకంగా ఉన్న ఇతన్ని క్రీస్తు నూతనపర్చాడు. అందును బట్టి ఫిలేమోనుకు మరియు ఒనేసీముకు నూతన సంబంధం ఏర్పడింది. ఒకప్పుడు అతడు ఫిలేమోనుకు బానిస. కాని ఇప్పుడు, సహ విశ్వాసి, ఆత్మీయ సోదరుడు.

**3. ఒనేసీమును చేర్చుకొమ్మని పౌలు విన్నపం :** ప్రప్రథమంగా ఫిలేమోను సహోదర ప్రేమను బట్టి ఒనేసీమును చేర్చుకోవాలని కోరాడు. పౌలును చేర్చుకొన్నట్లే అతన్ని కూడ చేర్చుకొమ్మన్నాడు (1:12,13) పౌలు విన్నపం వెనుక, పాపి పక్షంగా క్రీస్తు తండ్రితో చేసే విన్నపం కనిపిస్తుంది. పౌలు మరో ముఖ్య విషయాన్ని జ్ఞాపకం చేస్తున్నాడు. తన ద్వారా రక్షణ పొందిన ఫిలేమోను తనకు ఋణస్తుడు గనుక, ఒకవేళ ఒనేసీము ఏమైనా నష్టం కలుగజేసినా దాన్ని తన లెక్కలో వేసుకోమన్నాడు (1:18,19) అన్నిటికంటె ముఖ్యంగా ప్రయోజకునిగా మారిన ఒనేసీము తన విశ్వాసాన్ని నిరూపించుకోడానికి, మరో అవకాశాన్ని కల్పించాలని కోరాడు.

**4. క్రీస్తు చేసిన కార్యం :** ఒనేసీమును గూర్చి సిఫారసు చేస్తూ పౌలు, క్రీస్తు మన పాపాన్ని భరించడం మరియు ప్రత్యామ్నాయంగా ఉండిన విధానాన్ని జ్ఞాపకం చేసాడు (1:17). యేసు మన స్థానంలో ఉండి మన పాప శిక్షను భరించడమేగాక, మన పాప ఋణాన్నంతా సిలువలో చెల్లించాడు.

**5. పౌలు నిశ్చయత (1:19-25) :** పౌలు కొరకు ఫిలేమోను చేసే ప్రార్థనల ద్వారా తనకు విడుదల లభిస్తుందని, తిరిగి అతని వద్దకు వెళ్తాడని, పౌలు హామి ఇస్తూ తనకు బస సిద్ధం చేయమన్నాడు. అలాగే ఫిలేమోను కూడ తాను కోరిన దానికన్నా ఎక్కువగా చేయగలడని నమ్మాడు. వృద్ధ ఖైదీగానున్న పౌలు, ప్రత్యక్షంగా ఫిలేమోనుతో మాట్లాడలేకపోయినా ఈ చిన్న ఉత్తరం ద్వారా తెలియజేసాడు. ఉత్తరాల ద్వారా సహ విశ్వాసులతో, రక్త సంబంధికులతో ఆత్మీయ సంబంధాన్ని కొనసాగించుకొనే విధానాన్ని ఈ పత్రిక వివరిస్తుంది. ఉత్తరాల ద్వార కూడ ప్రతి విశ్వాసి గొప్ప పరిచర్య చేయవచ్చు. ఆ విధంగా అనేకులను ప్రభువు చెంతకు నడిపించడానికి ప్రభువు మీకు సహాయం చేయును గాక!

# గొప్ప ప్రధాన యాజకుడు

## హెబ్రీయులకు వ్రాసిన పత్రిక సంగ్రహ సమీక్ష

**A. I. ఉపోద్ఘాతం :**

క్రొత్త నిబంధనలోని పత్రికల విభాగంలో, విశిష్ఠమైనది మరియు ప్రత్యేకమైనది హెబ్రీ పత్రిక. ఒక క్రైస్తవేతరుడు, క్రైస్తవునితో క్రీస్తును గూర్చి సంభాషిస్తున్నప్పుడు యేసుక్రీస్తు ఎందుకు పుట్టాడు? ఎందుకు చనిపోయాడు? తిరిగి ఎందుకు లేచాడు? ప్రస్తుతం ఆయన ఎక్కడ ఉన్నాడు? ఏమి చేస్తున్నాడని ప్రశ్నిస్తారు. పై ప్రశ్నలన్నిటికి సువార్తల్లో, ఇతర పత్రికలలో జవాబు లభిస్తుంది. అయితే క్రీస్తు ప్రస్తుత పరిచర్యను గూర్చి స్పష్టంగా వివరించేది హెబ్రీ పత్రిక ఒక్కటే.

**II. గ్రంథకర్త :** హెబ్రీయులకు వ్రాసిన పత్రిక శీర్షికలో అపొస్తలుడైన పౌలు వ్రాసిన పత్రిక అని పేర్కొనబడినా, ఈ పత్రిక గ్రంథకర్తృత్వం నేటికీ ఓ ప్రశ్నగానే ఉంది. దీని గ్రంథకర్తను గూర్చి పలు అభిప్రాయాలున్నా ఏకగ్రీవంగా ఒక గ్రంథకర్తను బలపర్చడం లేదు. ఈ పత్రికను పౌలు వ్రాసాడని కొందరు, వ్రాయలేదని మరి కొందరు రుజువు చేయడానికి ప్రయత్నించారు.

హెబ్రీ పత్రిక ప్రారంభంలో ఇతర పత్రికల వలె శుభములు, అభినందనలుగాని, వందన సమర్పణ గాని లేదు గనుక అది ఉత్తరమా (ప్రతికనా) లేక ఒక అంశమునకు సంబంధించిన సాహిత్యమా అన్న ప్రశ్న అనేకులకు ఉంది. అయితే ఇది ఒక సాహిత్యంలా అనిపించినా అందులోని ప్రత్యేక అంశాలను బట్టి, బాగా పరిచయమైన ప్రత్యేక పాఠకులకు వ్రాయబడినదని, ఇది ఒక పత్రికనే అని ముగింపులోని మాటల్ని బట్టి తెలిసికోవచ్చును.

1. **గ్రంథ కర్తను గూర్చిన వివాదాలు :**

ఎ) హెబ్రీ పత్రికలో వ్రాయబడినవన్నీ లేవీయాజకత్వానికి సంబంధించినవి గనుక, అది లేవీయుడైన బర్నబా ద్వార వ్రాయబడిందని కొందరి అభిప్రాయం, (అపొ.కా. 4:36; హెబ్రీ 13:22-25).

బి) ఈ పత్రికలో పేర్కొనబడిన పాత నిబంధన వాక్యాలు గ్రీకులో తర్జుమచేయబడిన పాతనిబంధన (సెప్టువజింట్) నుండి తీసుకోబడ్డాయి మరియు అనేక పదాలు అలెగ్జాండ్రియా ప్రాంతానికి చెందినవిగా ఉన్నాయి గనుక రచయిత హెబ్రీయుడు కాడని, బహుశా అపోల్లో వ్రాసి ఉంటాడని కొందరి అభిప్రాయం.

సి) అందలి పదజాలాన్ని బట్టి కొంత మంది లూకా వ్రాసాడని మరి కొంతమంది క్లెమెంట్ వ్రాసాడని చెప్తారు. క్లెమెంట్ తన ఇతర రచనల్లో హెబ్రీ పత్రికలోని విషయాలు పేర్కొన్నాడు. గనుక ఈ పత్రికను అతడు వ్రాయలేదని అర్ధమౌతుంది.

డి) ఇక మిగిలిందల్లా పౌలు ఒక్కడే. ఇతని గ్రంథకర్తృత్వాన్ని అనుమానించే, సమర్ధించే విషయాలను పరిశీలిద్దాం. చరిత్రపరంగా గాని పారంపర్యంగా గాని, ఈ పత్రిక గ్రంథకర్తృత్వాన్ని గూర్చి ఏమిచెప్పబడలేదు గనుక పత్రికలో నుండే మనం ఆధారాలను తీసుకోవలసి ఉంటుంది.

1. ఈ పత్రికలో గ్రీకు శైలిని బట్టి దాని గ్రంథకర్త హెల్లేనీయుడైయుండవచ్చునని, అతనికి గ్రీకు భాషలో తర్జుమా చేయబడిన పాత నిబంధననే (సెప్టువజింట్) తెలుసునని ఒక అభిప్రాయం. అయితే పాతనిబంధన ఆచారాలను గూర్చి అన్యుల నుండి క్రైస్తవులైన వారికి అంతగా తెలియదుగనుక గ్రంథకర్త గ్రీకు భాష మాట్లాడగల యూదుడని చెప్పవచ్చును (1:1).

2. ఈ పత్రికలో క్రీస్తే కేంద్రంగా సూచించబడ్డాడు. ఆయన వ్యక్తిత్వం, బలియాగం, నైతిక బోధను గూర్చి, ఎసెటిజమ్ (వైరాగ్య సిద్ధాంతం)కు విరుద్ధంగా చెప్పబడిన విషయాలు, సంఘ బోధకులు, పరిపాలకుల పట్ల గల ఉన్నత ఉద్దేశం, గౌరవభావాన్ని బట్టి చూస్తే పౌలు గాని, లేక పౌలు ఆలోచనా విధానం వలన ప్రభావితుడైన క్రైస్తవుడు గాని వ్రాసాడని చెప్పవచ్చును.

3. సాధారణంగా పౌలు వ్రాసిన ఇతర పత్రికలలో పేర్కొన్న పాత నిబంధన వాక్యాలు, హెబ్రీభాష పాతనిబంధనలో నుండి తీసికోబడ్డాయి. అయితే హెబ్రీ పత్రికలోని పాత నిబంధన వాక్యాలు సెప్టువజింట్ నుండి తీసికోబడ్డాయి. అంత మాత్రమే కాదు, పౌలు, దేవుని వలననే తనకు సువార్త అప్పగించబడిందని చెప్పాడు (గలతీ 1:11,12) గనుక హెబ్రీ 2:3 లో వ్రాయబడిన దానిని బట్టి అతడు ఈ పత్రిక వ్రాయలేదని కొందరి అభిప్రాయం.

**2. పౌలు వ్రాసాడనడానికి ఆధారాలు :**

అ) ఆదిమ సంఘం పౌలు వ్రాసాడని అంగీకరించింది. అందుకు కారణాలు.

1. హెబ్రీ 13:25లోని ముగింపు మాటలు 1 థెస్స 3:17 లోని మాటల్లాగే ఉన్నాయి.
2. పౌలు ఇతర పత్రికలలో “నీతిమంతుడు విశ్వాసమూలమున జీవించును” అని హబక్కూకు గ్రంథం నుండి పేర్కొన్నమాటలు (హబ. 2:4) హెబ్రీ పత్రికలో కూడ పేర్కొనబడ్డాయి. (హెబ్రీ 10:38) (రోమా 1:17; గం 3:11) చదవండి.
3. ఈ పత్రిక ఇటలీ నుండి (13:24) తిమోతికి స్నేహితుడు మరియు చెరలోనున్న వ్యక్తి ద్వారా వ్రాయబడింది. (10:34, 13:23). అతడు బహుశా పౌలు కావచ్చు. (అపో. 28:16,30).
4. 2 పేతురు 3:15, 16ను బట్టి, పేతురు తన పత్రికను వ్రాసిన వ్యక్తులకే (1 పేతు 1:1) పౌలు కూడ వ్రాసాడని అర్ధమౌతుంది. అంతమాత్రమే కాక పౌలు వ్రాసిన పత్రికను పేతురు “లేఖనాలు”గా నిర్ధారించాడు.

ఆ) ఒక గ్రంథము, దాని గ్రంథకర్తను బట్టి ప్రామాణిక గ్రంథంగా ఎంచబడుతుంది. హెబ్రీ పత్రిక ప్రామాణిక గ్రంథంగా అంగీకరించబడి బైబిలులో చేర్చబడింది. ఈ ప్రామాణికతలో పౌలు గ్రంథకర్తగా అంగీకరించబడ్డాడు. రచయిత అతడు కాదు అనుకొంటె, అది ప్రామాణిక గ్రంథంగా అంగీకరించబడదు.

ఇ) ఈ పత్రిక పౌలు వ్రాసిన గ్రంథాలలాగే ఉన్నది గనుక అతడు స్వయంగా వ్రాయకున్న అతని శిష్యులెవరైన వ్రాసి ఉంటారని డివెట్ట్ మరియు బ్లీక్ అనే పండితుల అభిప్రాయం.

ఈ) హెబ్రీ పత్రికలోని కొన్ని మాటలు పౌలు ఇతర పత్రికలలో ఉన్నాయి, అవి ఇతరులు వ్రాసిన పత్రికలలో లేవని లిండ్‌సే అనే పండితుడు వివరించాడు. ఈ క్రింది వాక్యాలను పోల్చిచూడండి.

| | | |
|---|---|---|
| హెబ్రీ 1:1-3 | - | 2 కొరి. 4:4; కొల 1:15,16 |
| హెబ్రీ 1:4; 2:9 | - | ఫిలి 2:8,9 |
| హెబ్రీ 2:14,15 | - | 1 కొరి 15:54,57 |
| హెబ్రీ 7:26 | - | ఎఫె 4:10 |
| హెబ్రీ 10:12,13 | - | 1 కొరి 15:25 |
| హెబ్రీ 8:5, 10:1 | - | కొల 2:17 |
| హెబ్రీ 7:16,18,19 | - | రోమా 2:29; గల 3:3,24 |

పౌలు తన శైలిని మార్చడంలో, పేరును పేర్కొనక పోవడంతో ఏదైన ముఖ్యకారణం ఉండవచ్చును. ఏది ఏమైన మానవరీత్యా ఈ పత్రిక గ్రంథకర్త ఎవరు? అనే దానికన్నా, అది ఆత్మ ప్రేరితమైన దేవుని వాక్యమని, ప్రామాణిక గ్రంథంగా బైబిల్లో చేర్చబడడానికి అనుమంతించబడిందని తెలిసికొని అందలి సత్యాలను ఆత్మీయ జీవితానికి అన్వయింపజేసుకోవడం ఎంతైన అవసరం.

**III. పాఠకులు :** ఈ పత్రిక మొదట తూర్పు ప్రాంత సంఘాల్లో అతనేషియస్ ద్వారా అంగీకరించబడింది. తరువాత క్రీ.శ. 397 సం॥, కౌన్సిల్ ఆఫ్ కార్తేజ్‌లో అంగీకరించ బడింది. అది పంపిణీ చేయబడిన కాలంలో దానిపై పౌలు పేరు వ్రాయబడి ఉంది.

ఈ పత్రికలోని యూదా ఆచారాలను బట్టి, పాఠకులు యూదులేనని స్పష్టమౌతుంది. పాత నిబంధనను బాగా ఎరిగిన వారికి వ్రాయబడింది (హెబ్రీ 1:1; 3:9). రచయిత కూడ యూదుడే (13:13). ఈ పాఠకులు అబ్రహాము సంతానము, మరియు దేవుని ప్రజలుగా వారికి, వారి పితరులకు ఇవ్వబడిన వాగ్ధానాలకు వారసులు (4:1; 6:17,18; 11:39,40).

అయితే యూదుల నుండి క్రైస్తవులైన వీరు ఎక్కడ ఉన్నారు? యూదులు అన్ని దేశాలలో చెదరి ఉన్నా, ఈ పత్రిక ఒక ప్రత్యేక సంఘానికి వ్రాయబడింది. ఆ పాఠకులు ఎవరో అర్థం చేసికొంటేవారు, ఏ ప్రాంతం వారో తెలుస్తుంది. యూదుల నుండి క్రైస్తవులై పాలస్తీన ప్రాంతీయ గ్రీకు భాష మాట్లాడేవారిని హెబ్రీయులని, పాలస్తీనకు వెలుపలి ప్రాంతాలలోని గ్రీకు భాష మాట్లాడే యూదులను హెల్లేనీయులని పిలిచేవారు (అపొ.కా. 6:1). కనుక పాలస్తీనలో ఉన్న యూదులకే ఈ పత్రిక వ్రాయబడి ఉండవచ్చును. పైగా శ్రమలు సహించడం గూర్చి మరియు భ్రష్ఠత్వాన్ని గూర్చిన తలంపులున్నందు వలన అది యెరూషలేములోని యూదులకు వ్రాయబడిందని చెబుతారు.

**IV. వ్రాయబడిన కాలం :** హెబ్రీ పత్రిక క్రీ.శ. 96 సం॥ వ్రాయబడిందని ఇటీవల నిర్ణయించబడింది. అయితే పౌలు పత్రికలను ఆధారం చేసుకొని వ్రాసిన ఇతర గ్రంథకర్తలు ఈ పత్రిక క్రీ.శ. 50వ సం॥ తరువాత, మరియు యెరూషలేము మందిరం నాశనం చేయబడక ముందు (క్రీ.శ. 70) వ్రాయబడిందని చెబుతారు.

పాత నిబంధన విషయాలు ఇందులో అనేకమున్నాయి, పైగా ఈ పత్రిక వ్రాయబడిన నాటికి, ఇంకా బలులు అర్పించబడుతూనే ఉన్నాయి మరియు, యెరూషలేము దేవాలయం నాశనం కాకముందున్న క్లెమెంట్, జస్టిస్ మార్టేర్, హెర్మాస్, తెర్తులియన్ మొదలైన రచయితలు ఈ పత్రికలోని విషయాలను వారిగ్రంథాలలో పేర్కొన్నారు గనుక క్రీ.శ. 70 సం॥కు ముందే వ్రాయబడి ఉండవచ్చును (8:3-5; 13:11,12). పౌలు ఈ పత్రిక గ్రంథకర్తకాదని చెప్పేవారు కూడ క్రీ.శ. 50-96 మధ్య కాలాన్నే సూచించారు.

క్రీ.శ. 70 సం॥ తరువాత వ్రాయబడిందని చెప్పేవారు, సరైన కారణాలను గాని, దేవాలయ నాశనాన్ని గూర్చి గాని ఈ పత్రికలో ఎందుకు ప్రస్తావించబడలేదో చెప్పలేదు.

**V. హెబ్రీ పత్రిక విశిష్ఠత :** రోమీయులకు వ్రాయబడిన పత్రిక తరువాత క్రొత్త నిబంధనలో చెప్పుకోదగిన శ్రేష్ఠమైన పత్రిక, హెబ్రీయులకు వ్రాయబడిన పత్రిక. రోమా పత్రిక క్రైస్తవ విశ్వాసము యొక్క అవశ్యకతను తెలియజేస్తుంది. హెబ్రీ పత్రిక క్రైస్తవ విశ్వాసం యొక్క శ్రేష్ఠతను వివరిస్తుంది. పత్రిక అంతటిలో శ్రేష్ఠమైన లేక గొప్ప వాటిని గూర్చిన తలంపు ప్రస్ఫుటం చేయబడింది. కొన్ని ముఖ్యమైన పదాలు పలుమార్లు ప్రస్తావించ బడ్డాయి.

| | | |
|---|---|---|
| 1. పరిపూర్ణమైన / సంపూర్ణమైన | – | 14 సార్లు |
| 2. సదాకాలం / నిత్యము | – | 15 సార్లు |
| 3. శ్రేష్ఠమైన / గొప్ప **(Better than)** | – | 13 సార్లు |
| 4. పాలిభాగస్తులు | – | 19 సార్లు |
| 5. పరలోకం | – | 17 సార్లు |
| 6. యాజకుడు / ప్రధానయాజకుడు | – | 32 సార్లు |
| 7. మనము... చేయుదము **(Let us)** | – | 13 సార్లు |

హెబ్రీ పత్రికను 5వ సువార్త అని పిలువవచ్చును. క్రొత్త నిబంధనలోని 4 సువార్తలు యేసుక్రీస్తు భూమి మీద చేసిన పరిచర్యను వివరిస్తున్నాయి. హెబ్రీ పత్రిక ఆయన పరలోకంలో విశ్వాసుల కోసం ప్రస్తుతం చేస్తున్న పరిచర్యను గూర్చి తెలియజేస్తున్నది.

**VI. మూలాంశం :** "యేసు మీద లక్ష్యముంచుడి" హెబ్రీ 3:1.

**ఆ. హెబ్రీ పత్రిక విభజన :**

**I. సిద్ధాంతపరమైన భాగం : పాత నిబంధనలోని పరిమితమైనవాటి కంటె క్రీస్తు గొప్పవాడు - 1-10 అధ్యా.**

**1. క్రీస్తు ప్రవక్తల కంటె గొప్పవాడు – 1:1–3**

**2. క్రీస్తు దేవదూతల కంటె గొప్పవాడు – 1:4–2:18**

ఎ) క్రీస్తు దైవత్వం (1:4–14) బి) క్రీస్తు మానవత్వం (2:1–8)

**3. క్రీస్తు మోషే కంటె గొప్పవాడు – 3:1–4:2**

**4. క్రీస్తు యెహోషువ కంటె గొప్పవాడు – 4:3–13**

**5. క్రీస్తు లేవీ వంశపు యాజకత్వం కంటె గొప్పయాజకత్వం గలవాడు – 4:14–16**

ఎ) మన గొప్ప ప్రధాన యాజకుడు (4:14–16)
బి) యాజకుని యొక్క నిర్వచనం (5:1–10)
సి) క్రీస్తు మెల్కీసెదెకు క్రమము చొప్పున మన ప్రధానయాజకుడు
– క్రీస్తు శాశ్వతమైన యాజకుడు (7:1–3)
– క్రీస్తు పరిపూర్ణుడైన యాజకుడు (7:4–22)
– క్రీస్తు తన వ్యక్తిత్వంలో నిత్యుడు మరియు పరిపూర్ణుడు (7:23–28)

**6. క్రీస్తు మన ప్రధానయాజకునిగా, శ్రేష్ఠమైన గుడారములో, శ్రేష్ఠమైన వాగ్దానాలతో కూడిన శ్రేష్ఠమైన నిబంధన ద్వారా పరిచర్య చేస్తున్నాడు – 8:1–10:39**

ఎ) నిజమైన గుడారం (8:1–5)
బి) పాత నిబంధన కంటె శ్రేష్ఠమైన క్రొత్త నిబంధన (8:6–13)

సి) పాత గుడారము కంటె శ్రేష్ఠమైన క్రొత్త గుడారం (9:1-10)
డి) శ్రేష్ఠమైన బల్యర్పణ (9:11-10:18)
ఇ) ప్రోత్సాహము (10:19-25)

**II. ఆచరణాత్మకమైన భాగం : క్రీస్తు శ్రేష్ఠమైన మేళ్ళను మరియు విధులను ప్రవేశ పెట్టాడు - 11-13 అధ్యా.**

**1. విశ్వాసం - (11:1-40)**
**2. నిరీక్షణ - (12:1-29)**
ఎ) క్రైస్తవ పరుగుపందెం (12:1,2).
బి) ప్రస్తుతం విశ్వాసులు పందెంలో మరియు పోరాటంలో ఉన్నారు. (12:3-14).
**3. ప్రేమ (13:1-25)**
ఎ) విశ్వాసుల రహస్య జీవితం (13:1-6)
బి) విశ్వాసుల సాంఘీక జీవితం (13:7-14)
సి) విశ్వాసుల ఆత్మీయ జీవితం (13:15-19)
డి) ఆశీర్వచనం (13:20-24)

**ఇ. హెబ్రీయులకు వ్రాసిన పత్రిక - అంశాల వారిగా సంగ్రహ సమీక్ష :**

హెబ్రీ పత్రిక అంతా గొప్ప వాటిని గూర్చే వివరిస్తున్నది. అలాంటి శ్రేష్ఠమైన వాటిని విశ్వాసులు తెలుసుకోవలసిన అవసరత ఎంతైనా ఉంది.

**I. గొప్ప వ్యక్తి - యేసు క్రీస్తు (1:1-5:10) :**

ఎ) **యేసు ప్రవక్తల కంటె గొప్పవాడు :** ఆయా సమయాల్లో దేవుడు తన వాక్యాన్ని ప్రవక్తల ద్వారా కొద్దికొద్దిగా మానవులకు అందిస్తూవచ్చాడు. కాని క్రీస్తు ఒక్కడే అదృశ్యదేవుని సంపూర్ణ సువార్తను అందించాడు. కనుక ఆయన ప్రవక్తల కంటె గొప్పవాడు అని దేవుడే ప్రకటించాడు. అంతమాత్రమే కాదు ఆయనను గూర్చి దేవుడు వర్ణించిన దానిని బట్టి మరియు ఆయన హెచ్చించబడి దేవుని కుడి పార్శ్వమున ఉన్నందు వల్ల ప్రవక్తలందరి కంటె గొప్పవాడు.

బి) **యేసు దూతల కంటె గొప్ప వాడు (1:4 - 2:18) :** ఆయనకివ్వబడిన స్థానమును బట్టి (1:4) తండ్రితో ఆయనకు ఉన్న సంబంధాన్ని బట్టి (1:5) దూతల ద్వారా నమస్కరించబడిన విమోచన కార్యమును బట్టి క్రీస్తు దూతల కంటె గొప్పవాడు.

సి) **యేసు క్రీస్తు మోషే కంటె గొప్పవాడు (3:1-6) :** వీరిద్దరూ నమ్మకంగా ఉన్నారు. మోషే దేవుని యింటిలో నమ్మకంగా ఉన్నాడు. కాని దానిని కట్టిన వాడు ఎక్కువ ఘనతకు పాత్రుడు గనుక క్రీస్తు మోషే కంటె ఎక్కువ మహిమకు అర్హుడుగా ఎంచబడ్డాడు. అంత మాత్రమే కాదు, మోషే పరిచారకుడై నమ్మకంగా ఉంటే యేసుక్రీస్తు కుమారుడై నమ్మకంగా ఉన్నాడు.

డి) **క్రీస్తు యెహోషువ కంటె గొప్పవాడు (4:1-16) :** యెహోషువ నాయకత్వంలో, కానానులో ప్రవేశించిన ఇశ్రాయేలీయులకు ఇవ్వబడిన విశ్రాంతి 25-40 సం॥లు మట్టుకే ఉండినది. కాని యేసు క్రీస్తు ఇచ్చే విశ్రాంతి శాశ్వతమైనది. గనుక ఆయన యెహోషువ కంటె గొప్పవాడు. బైబిలులో విశ్రాంతిని గూర్చి మూడు విషయాలున్నాయి.

1. సృష్టికార్యం తరువాత విశ్రాంతి (హెబ్రీ 4:4)

2. రక్షణ పొందిన వారికి కలిగే విశ్రాంతి (హెబ్రీ 4:3,9)

3. విశ్వాసి సమర్పణను బట్టి కలిగే విశ్రాంతి (హెబ్రీ 4:10,11)

యహోషువ ద్వారా కలిగిన విశ్రాంతి కంటె యేసుక్రీస్తు ద్వారా కలిగే విశ్రాంతి బహు గొప్పది. **'యెహోషువ వారికి విశ్రాంతి కలుగజేసిన యెడల ఆ తరువాత మరియొక దినమును గూర్చి ఆయన చెప్పక పోవును." (4:8).**

ఇ) **క్రీస్తు అహరోను కంటె గొప్పవాడు (5:1-10) :** యేసు క్రీస్తు అహరోను కంటె గొప్పవాడు అని చెప్పడానికి రెండు ముఖ్య కారణాలున్నాయి. ఆయన అహరోనులాగే మనుష్యులలో నుండే వచ్చాడు (5:1) దేవుని చేత ఏర్పరచబడ్డాడు (5:4) అహరోను లాగే కనికరం గలవాడు (5:2) విధేయతను నేర్చుకొన్నాడు (5:8), ప్రార్థించాడు (5:7) శ్రమపొందాడు. (5:8, ఫిలి 2:8) అయితే అహరోను వీటన్నిటిని పాక్షికంగా, కొంతవరకే చేయగలిగాడు, గాని క్రీస్తు పరిపూర్ణంగా చేసాడు. తన వ్యక్తిత్వంలో క్రీస్తు ఎప్పుడూ పరిపూర్ణుడే, అలాగే భూమిపై ఉన్నప్పుడు కూడ ఆయన పనిలో పరిపూర్ణుడయ్యాడు. రెండవదిగా, అహరోనులో పూర్తిగా లేనివాటిని క్రీస్తు సంపూర్ణంగా కలిగి ఉన్నాడు. ఆయన అహరోను వలె మానవుడే కాక దేవుని ఏకైక కుమారుడైయున్నాడు (5:5). అహరోనులా లేవీ క్రమములోకాక మెల్కీసెదెకు క్రమంలో యాజకుడు (5:6) అహరోనులా తాత్కాలిక రక్షణకు కాకుండా, శాశ్వతమైన రక్షణకు కారణమయ్యాడు (5:9).

II. **గొప్ప ఉద్దేశం - సంపూర్ణులగుట (5:11-6:20) :** మారుమనస్సు పొందిన ప్రతి విశ్వాసి సంపూర్ణులగుటకు సాగిపోవాలి. (6:2) ఈ పత్రిక పాఠకులు రక్షించబడిన కాలాన్ని బట్టి చూస్తే బోధకులై ఉండాలి గాని ఇంకా పాలు త్రాగాల్సిన స్థితిలో ఉన్నారని గ్రంథకర్త వాపోతున్నాడు. (5:11-14) వారు ఎదగలేక పోవడానికి కారణాలను వివరిస్తూ సంపూర్ణతలోనికి ఎదగడానికి అవసరమైన సూచనలు ఇచ్చాడు.

సంపూర్ణులు కావాలంటే వేసిన పునాదినే మరలా వేయకుండ పునాదిపై గోడలను కట్టాలి. ఆ ఆ ఇ ఈ లు మాని పట్టభద్రులవడానికి ప్రయాస పడాలి. విశ్వాస జీవితంలో ప్రతి కోణంలో నేర్చుకోవలసిన వెన్నో ఉన్నాయి. పరిశుద్ధులకు ఉపచారం చేయడం (6:10) యేసు నామమున ఇతరులను ప్రేమించడం (6:10) ఓర్పు చేత వాగ్దానాలను స్వతంత్రించుకొన్న వారిని పోలి నడచుకోవడం (6:11) ఆత్మీయ విషయాల పట్ల ఆసక్తి చూపించడం (6:12) ఎంతైన అవసరం. మంచి క్రియలు ఒక పాపిని నరకం నుండి రక్షించవు గాని పరిశుద్ధుడు తీర్పులోనికి రాకుండ తప్పించగలవు.

III. **గొప్ప యాజకత్వం - మెల్కీసెదెకు క్రమం (7-10 అధ్యా) :** మెల్కీసెదెకు క్రమం చొప్పున క్రీస్తు జరిగించిన యాజకత్వం నాలుగు విధాల మేలును చేకూర్చింది.

అ) **క్రీస్తు యాజకత్వం గొప్ప ఆధారమును కలుగజేసింది :** లేవి గోత్రమువాడైన అహరోను వంశంవారు తప్ప మరెవరూ యాజకత్వం చేయకూడదు. క్రీస్తు యూదా వంశం నుండి వచ్చాడు (7:14; 22-24). అయినా ఆయన యాజకత్వం అధికార పూర్వకమైనది. లేవీ పితరుడైన అబ్రాహాము ద్వారా మెల్కీసెదెకు దశమ భాగం పొందాడు. ఆ సమయంలో లేవీ యాజకత్వం ప్రారంభికుడైన అహరోను కూడ దేవుని వాగ్దానం ప్రకారం అబ్రాహాము గర్భంలో ఉన్నాడు (ఆది. 14:18). లేవీ, అహరోను కూడ అబ్రాహాము ద్వారా దశమ భాగాన్ని సమర్పించారు (7:4-10). వాస్తవంగా లేవీయులు ప్రజల నుండి దశమ భాగాలు తీసికోవాలి గాని, ఇక్కడ వీరందరు తమ పితరుడైన

అబ్రాహాము ద్వారా మెల్కీసెదెకుకు దశమ భాగమిచ్చారు. మెల్కీసెదెకు యాజకుడు మరియు రాజు కూడ. కనుక క్రీస్తు ఇతని క్రమము చొప్పున రాజవంశపు యాజకత్వాన్ని పొందాడు. పైగా ఆయన దేవుని వాగ్దానం ప్రకారం నియమించబడ్డాడు గనుక స్వేచ్ఛాపూర్వక యాజకత్వం (హెబ్రీ 7:17; కీర్త 110:4) మరియు శాశ్వతమైన, మార్పులేని (7:24) పరిశుద్ధ యాజకత్వం (7:26) ఇవ్వబడింది. ఇది లేవీ యాజకత్వానికి భిన్నమైనది (నిర్గ 32:1-6, 21-25, 1 సమూ 2:12-17, 8:1-3). వీరందరు పాపులలో చేర్చబడ్డారుగాని క్రీస్తు వీరిలో చేర్చబడని ప్రత్యేక యాజకుడు. మనల్ని సంపూర్ణులుగా చేయగల యాజకత్వం ఆయనది (7:19,25). ఈయన యాజకత్వంలో మరో విశేషమేమంటే ఆయనే యాజకుడు, అయనే బల్యర్పణ (7:27). పరిశుద్ధ యాజకునిగా, మానవుల పాప పరిహారార్థం అర్పించడానికి స్వయంగా తాను తప్ప మరే నిర్దోషమైన బల్యర్పణ ఆయనకు కనిపించలేదు.

**ఆ) మెల్కీసెదెకు క్రమానికి చెందిన క్రీస్తు యాజకత్వం శ్రేష్ఠమైన లిపి కలిగినది :**

పాత నిబంధన నుండి క్రొత్త నిబంధనకు మార్చబడింది (8వ అధ్యా). నిబంధన అన్నది రెండు వర్గాలకు సంబంధించినది. ఒక వర్గం మరో వర్గం యొక్క నియమ నిబంధనలకు కట్టుబడి ఉంటుంది. దేవుడు మానవులతో చేసిన క్రొత్త నిబంధనలోని విశేషమేమంటే దేవుడొక్కడే బేషరతుగా నిబంధన చేసాడు (లూకా 22:20; 1 కొరి 11:25, 2 కొరి 3:6) హెబ్రీ పత్రికలో నిబంధన అనే మాట 22 సార్లు వ్రాయబడింది. దేవుడు చేసిన క్రొత్త నిబంధనలో (హెబ్రీ పత్రిక 8వ అధ్యాయంలో) పాత నిబంధన ఒప్పందానికి భిన్నమైన ఒప్పందం ఉంది. మోషే మధ్యవర్తిగా ఉన్న (యోహా 1:17 గల 3:19) పాత నిబంధన షరతులతో కూడినది, లోపము గలది (హెబ్రీ 8:7) నిర్జీవమైన రాళ్ళపై వ్రాయబడింది (నిర్గ 32:15). క్రీస్తు మధ్యవర్తిగా ఉన్న క్రొత్త నిబంధన (యోహా 1:17; హెబ్రీ 9:15) షరతులు లేనిది (8:9) నీతినిచ్చేది (8:11) సజీవమైన హృదయాలపై వ్రాయబడింది (8:10).

**ఇ) మెల్కీసెదెకు క్రమం ద్వారా శ్రేష్ఠమైన ఆలయం ఏర్పరచబడింది :** భూసంబంధమైన గుడారము కాక పరలోక సంబంధమైన గుడారం ఏర్పరచబడింది.

**1. భూసంబంధమైన ఆలయం దానిలోని లోపాలు :** అది ఈ లోకానికి సంబంధించినది (9:1). నిజమైన దాని యొక్క ఛాయ (నమూనా) మాత్రమే (9:9) అది తాత్కాలికమైనది (9:8). అందులో అందరికి ప్రవేశం లేదు (9:7). దేవుని మొదటి పనియైన సృష్టి కార్యంతో సంబంధం కలది (9:11). మానవ కృతమైనది (9:24) నిష్ప్రయోజనమైన జంతువుల రక్తం ద్వారా యాజకత్వం నిర్వహించబడింది (9:9). శాశ్వత నిరీక్షణకు సంబంధించినది (9:10).

**2. పరలోక సంబంధమైన గుడారం - దాని శ్రేష్ఠత :** ఇది పరలోక సంబంధమైనది, వాస్తవికమైనది. దేవుని రెండవ పనియైన విమోచన కార్యానికి సంబంధించినది, నిరంతరం ఉండేది. ఈ గుడారం, అందరూ పూర్తిగా ప్రవేశించదగినది (4:16; 10:19) మానవ హస్తకృతం కాదు (9:24). ఇందులో క్రీస్తు రక్తం ద్వారా యాజకత్వం నిర్వహించబడుతుంది (9:10). ఈ ఆలయం నిత్య రక్షణను గూర్చి సంపూర్ణంగా ప్రయోజనకరమైనది (9:12), శాశ్వత నిరీక్షణ గలది (9:24,26,28).

**ఈ) మెల్కీసెదెకు క్రమము ద్వార శ్రేష్ఠమైన బలి అర్పించబడింది (10 అధ్యా):** బలిపశువు,

గొఱ్ఱె పిల్ల నుండి దేవుని గొఱ్ఱె పిల్లకు మార్చబడింది. దేవుని గొఱ్ఱెపిల్ల యొక్క విధేయత (10:5,7; ఫిలి 2:6) ఆయన పూర్తిచేసిన విమోచన ప్రస్తుత శుద్ధీకరణ, రాబోవు మహిమకు సంబంధించిన విషయాలు (10:12,13) దేవుని గొఱ్ఱె పిల్ల ద్వారా కలిగిన ప్రోత్సాహం, నిశ్చయత (10:17,19) మరియు పరిశుద్ధులను గూర్చి ఆయనకున్న శ్రద్ధను బట్టి (10:24,25,34) దేవుని గొఱ్ఱెపిల్ల యొక్క అవశ్యకత ఎంత గొప్పదో అర్థమౌతుంది (10:4).

## IV. గొప్ప సూత్రము - విశ్వాసము 11-13 అధ్యా :

**అ) విశ్వాసవీరులు (11అధ్యా) :** హెబ్రీ పత్రిక గ్రంథకర్త 10వ అధ్యాయం చివరి భాగంలో విశ్వాసి మరియు అతని గొప్ప ప్రధానయాజకున్ని గూర్చిన క్లుప్త వివరణతో ముగించాడు (హెబ్రీ 10:37-39). ఈ పత్రికను 10వ అధ్యాయం వరకు చదివాక, పాఠకులకు విశ్వాసమంటే ఏంటి? ఈలాంటి విశ్వాసంగల వారెవరైనా ఉన్నారా? అనే ప్రశ్నలు కలుగవచ్చును. కనుక గ్రంథకర్త 11వ అధ్యాయంలో విశ్వాస వీరుల జాబితా ఇచ్చాడు.

**1. విశ్వాసం యొక్క నిర్వచనం (11:1-3) :** విశ్వాసమంటే నిరీక్షించే వాటిని గూర్చిన నిశ్చయత, అదృశ్యమైనవి ఉన్నవనడానికి రుజువు, (11:1) భవిష్యత్తును ప్రస్తుతముగా, అదృశ్యమైనవి దృశ్యమైనవిగా ఎంచేలా, విశ్వాసి హృదయాన్ని సిద్ధపరుస్తుంది విశ్వాసం. గమనించండి, అదృశ్యమైన వాటిని నమ్మడమంటే తెలియని వాటిని నమ్మడం కాదు. సృష్టికి ముందున్న వాటిని గూర్చి తెలిసికోడానికి కూడ విశ్వాసం అవసరం (11:3,6). విశ్వాసం అంటే నిరీక్షిస్తున్న వాటిని గూర్చిన హక్కు పత్రం, అనగా వాటిని తప్పకుండా పొందుతాము.

**2. ప్రదర్శించబడిన విశ్వాసం (11:4-40) :** దేవునియందలి విశ్వాసం ద్వారా పాత నిబంధన భక్తులు సాధించిన గొప్ప కార్యాలు ఈ భాగంలో ప్రదర్శించబడ్డాయి. ఇందులో 15 మంది పేర్లు వ్రాయబడ్డాయి. ఇంకా ఎందరో ఈ జాబితాలో ఉన్నారు.

**ఆ) విశ్వాసము యొక్క మాదిరి :** హెబ్రీ 12:1-3 వచనాల్లో పేర్కొనబడిన పరుగుపందెం పౌలు ఇతర పత్రికలలో ప్రస్తావించబడినందువల్ల పౌలే ఈ పత్రిక రచయిత అని బలపరుస్తుంది. పౌలు ఒక మిషనరీ, ఆత్మల సంపాదకుడు, కాపరి, గొప్ప వేదాంతి, గుడారాలు కుట్టేవాడు అయినా, ఆటలంటే ఇష్టం అని అర్థమౌతుంది. తనకున్న ఈ ఆసక్తిని విశ్వాసుల జీవితానికి అన్వయింపజేసి ప్రోత్సాహించాడు (ఎఫె 6:12; 2 తిమో 4:7; 1 కొరి 9:24-26). హెబ్రీయులకు వ్రాసిన పత్రిక 12:1లో విశ్వాసి జీవితం పరుగుపందెమునకు పోల్చబడింది. విశ్వాస జీవితంలో అనేక పర్యాయాలు, దేవుని కొరకు ఒంటరిగా చేయబడిన అనుభవాలు ఎదురై, నిరుత్సాహానికి గురియైనపుడు (1 రాజు 1:19,10,14) మనం ఒంటరిగా లేమని మన చుట్టు గొప్ప సాక్షి సమూహం ఉందన్న ప్రోత్సాహాన్ని ఈ వాక్యం ద్వారా పొందగలుగుతాము. ఈ సాక్షులందరూ విని, చూచి, అనుభవించినవారే. అనగా విశ్వాసముంచి, విధేయత చూపించడమే గాక శ్రమానుభవాన్ని కూడ బాగా ఎరిగినవారు.

విశ్వాసి పరుగుపందెంలో కొనసాగడానికి, గురిని చేరడానికి ప్రతి భారాన్ని మరియు చిక్కులు పెట్టు పాపాన్ని విడచిపెట్టాలి. బహుశా ఇది అవిశ్వాసమనే పాపం గూర్చి, మరియు విశ్వాస జీవితానికి భంగం కలిగించే వాటిని గూర్చి చెప్పబడి ఉండవచ్చును. ఈ పరుగు పందెమును, విశ్వాసి దేవుని ద్వారానే ప్రారంభిస్తాడు, ప్రతి అడుగు దేవునిచే

నిర్ణయించబడింది. ప్రతి విశ్వాసి శ్రద్ధగా పరుగెత్తి గెలవాలని నిర్దేశించబడింది. అందుకు, యేసువైపు చూస్తూ పరుగెత్తాలి. ఇతరులవైపు చూస్తే ముందుకు సాగలేము. ఒకవేళ మనకంటె వెనుకబడిన వారిని చూస్తే మనం అతిశయించవచ్చును, లేక మనకంటె ముందున్న వారిని చూస్తే అసూయ కలుగవచ్చును. మనల్ని మనం చూచుకొన్నా, ఇతరులను చూసినా నిరాశకలుగుతుంది గాని యేసువైపు చూస్తే ప్రోత్సాహం, సంతోషం, ఉత్సాహం వస్తుంది. కనుక యేసుక్రీస్తునే, మన విశ్వాసానికి మాదిరిగా ఉంచుకోవాలి (12:2,3).

**ఇ) విశ్వాస జీవిత క్రమ శిక్షణ (12:4-11) :**

**1. క్రమ శిక్షణకు కారణాలు :** అనేక పర్యాయాలు మనం దేవుణ్ణి, దేవుని కార్యాలను, దేవుని వాక్యాన్ని మరచిపోతాము (కీర్త 103:2). అలాంటి సందర్భాలలో దేవుడు మనం ఆయనను, ఆయన మాటల్ని జ్ఞాపకం చేసుకోవాలని మనల్ని గద్దించి శిక్షిస్తాడు. కుమారులతో సంభాషించినట్లు ఆయన మనతో సంభాషించి, చేసిన హెచ్చరికలను మరచిపోతే (హెబ్రీ 12:6) దేవుడు చేయగలిగింది ఇదొక్కటే. హెబ్రీ 12:5,6 లో జ్ఞాపకం చేయబడిన ఈ మాటలు సామెతలు 3:11,12 లో వ్రాయబడ్డాయి. దేవుని ఈ శిక్షణ ఆయనకు మన పట్లగల ప్రేమను రుజువు చేస్తుంది. “ప్రభువు తాను ప్రేమించు వానిని శిక్షిస్తాడు”. మన చెడు ప్రవర్తనను దిద్దుకోడానికి, సత్ప్రవర్తన అలవర్చుకోడానికి ఉపయోగించే సాధనం ఇది. మనం నిజంగా దేవునికి చెందినవారమని ఈ శిక్ష ద్వారా నిరూపించబడుతుంది (12:7,8). మనం ఆయన శిక్షలో పాలుపొందనట్లయితే అయనకు చెందినవారము కాము. ఆయన క్రమ శిక్షణలోనికి వస్తే క్రీస్తు వలె మార్పు చెందుతాము. తన పరిశుద్ధతలో పాలుపొందడానికే ఆయన శిక్షిస్తాడు (12:10).

**2. క్రమ శిక్షణకు కలిగే ప్రతి స్పందన :** విశ్వాసి కొన్ని పర్యాయాలు దేవుని శిక్షను తృణీకరించవచ్చును. కనుక “నా కుమారుడా, ప్రభువు చేయు శిక్షను తృణీరించవద్దు” (12:5) అంటున్నాడు. దేవుని శిక్షను గూర్చి చాల తీవ్రంగా తీసుకొన్నవారు సంతోషంగా స్వీకరించలేరు. దేవుణ్ణి అపార్థం చేసికొంటారు. అయితే విశ్వాసి తన విశ్వాసాన్ని సాధకం చేసికోవాలని ఈ శిక్ష అమలు పర్చబడుతుంది. క్రైస్తవుడు ఎన్ని తప్పులు చేస్తాడన్నది ప్రశ్నకాదు గాని, ఆ తప్పుల ద్వారా ఎంత నేర్చుకొన్నాడన్నది ముఖ్యం. దావీదు “యెహోవా నీవు శిక్షించువాడు, నీ ధర్మశాస్త్రమును బట్టి నీవు బోధించువాడు ధన్యుడు” అని (కీర్త 94:12) “శ్రమకలుగక మునుపు నేను త్రోవ విడిచితిని, నేను నీ కట్టడలను నేర్చుకొనునట్లు శ్రమనొందియుండుట నాకు మేలాయెను” (కీర్త 119:67,71) అని దేవుని క్రమశిక్షణను సంతోషంగా స్వీకరించాడు. పైగా దేవుడు కోపాన్ని బట్టికాక, తన పొరపాట్లను బట్టే విశ్వాస్యత గలవాడై శిక్షించాడని దావీదు ఒప్పుకొన్నాడు (కీర్తన 119:75). ప్రియ సోదరా! సోదరీ! మీ ప్రతిస్పందన ఎలా ఉంది?

**3. క్రమ శిక్షణ ఫలితం (12:11) :** దేవుని శిక్ష, గద్దింపుకు లోనైనపుడు దుఃఖకరంగానే ఉంటుంది గాని, భవిష్యత్తులో అది నీతి, మరియు సమాధానకరమైన ఫలితాన్నిస్తుంది (యోబు 33:19,26,29).

**ఈ) విశ్వాసమును జీవితంలో చూపించుట (13 అధ్యా) :**

**1. విశ్వాసుల విధులు :** సహోదర ప్రేమ నిలువరముగా ఉండాలి (13:1) పరదేశులకు అతిథ్యమివ్వాలి (13:2) బంధకాలలో, కష్టాలలో ఉన్నవారిని జ్ఞాపకం చేసికోవాలి

(13:3) వ్యభిచరించవద్దు అన్న దేవుని ఆజ్ఞను (నిర్గ 20:14) నెరవేర్చడానికి వివాహం చేసికోవాలి, వైవాహికం జీవితాన్ని అన్ని విషయాలలో ఘనమైనదిగా ఎంచుకోవాలి, పరిశుద్ధతను కాపాడుకోవాలి (13:4) ధనాపేక్షలేని వారై యుండాలి (13:5) వాక్యాన్ని బోధించేవారిని జ్ఞాపకం చేసికోవాలి (13:7) అన్యబోధలచేత త్రిప్పబడవద్దు (13:9) ఎల్లప్పుడు స్తుతి యాగం చేయాలి (13:15; 1పేతు 2:5,9) బోధకులకు లోబడాలి (13:17) వారి కొరకు ప్రార్థించాలి (13:18).

2. విశ్వాసుల ఆనందం : మన పవిత్ర విశ్వాసం అనేక శ్రేష్ఠమైన దీవెనలనిస్తుంది. మనం విశ్వాసాన్ని విడచిపెట్టనంత వరకు దేవుడు మనల్ని విడువడు (13:5). దేవుడు నా సహాయకుడు అని ధైర్యంగా చెప్పగలం (13:6) ఏ విషయంలోను భయపడము. ఎన్నడు మారని, మార్పు చెందని దేవుడు మనకున్నాడు, ఆయన కార్యాలలో మార్పులేదు (13:8). మన విశ్వాసాన్ని బట్టి, ఉండబోవు దాని కోసం నిరీక్షించగలం (13:14). దానిని స్వంతం చేసుకొనేలా గొప్ప కాపరియైన క్రీస్తు మనల్ని సిద్ధపరుస్తాడు (13:20,21). విశ్వాసులుగా ఇదే మన ఆనందం.

**V. గొప్ప ప్రమాదసూచనలు :** హెబ్రీయులకు వ్రాయబడిన పత్రిక విశ్వాసాన్ని గూర్చి, విశ్వాసి జీవితాన్ని గూర్చి నేర్పించడమే కాక విశ్వాస జీవితంలో ఎదురయ్యే ప్రమాదాలను గూర్చి కూడ హెచ్చరిస్తుంది.

**అ) మొదటి ప్రమాద సూచన – కొట్టుకొని పోవు ప్రమాదం (Peril of Drifting) (2:14) :**

"కావున మనము వినిన సంగతులను విడిచిపెట్టి కొట్టుకొని పోకుండునట్లు వాటియందు మరి విశేష జాగ్రత్త కలిగియుండవలెను" (2:1). ఈ హెచ్చరిక నేటికి ప్రతి దేవుని బిడ్డకు వర్తిస్తుంది. ఈ ప్రమాదం దేవుని వాక్యాన్ని అగౌరవపర్చడం (2:2) మరియు నిర్లక్ష్యాన్ని బట్టి జరిగే ప్రమాదం. ఆత్మీయ విషయాలను నిర్లక్ష్యం చేయడం శోచనీయం. దేవుని వాక్యాన్ని విని కూడ, దానిని తీవ్రముగా జీవితానికి అన్వయించుకోని వారు కొట్టుకొని పోతారు. దేవుని దూతల ద్వారా ఇవ్వబడిన వాక్యానికి (అపో.కా. 7:53; గలతీ 3:19) అవిధేయులైన ఇశ్రాయేలీయులే శిక్షించబడితే, దేవుని కుమారుని ద్వారా పలుకబడిన మాటలను అగౌరవపరిస్తే మరెంత గొప్ప శిక్ష ఉంటుందో ఊహించండి. పుట్టిన ప్రతి వ్యక్తి పాపియే గనుక నరకానికి వెళ్ళే మార్గంలో కొట్టుకొనిపోతున్నాడు. అయితే క్రీస్తువైపు తిరిగిన వారు రక్షించబడుతున్నారు. స్వాభావికంగా తప్పిపోయిన స్థితిలో ఉన్న వారి నిర్లక్ష్యమే వారి నాశనానికి కారణమౌతుంది.

**ఆ) రెండవ ప్రమాద సూచన : అనుమానించే ప్రమాదం (Peril of doubting) (3:7 – 19:4:11) :** ఈ భాగం దేవుని వాక్యాన్ని అనుమానించడం వలన కలిగే ప్రమాదాన్ని సూచిస్తుంది. దీనిని బట్టి జీవము గల దేవుణ్ణి విడచిపోయే ప్రమాదం ఉంది (3,12,19). ఈ ప్రమాదాన్ని తప్పించుకోవాలంటే, ప్రతి దినము ఒకనికొకడు బుద్ధిచెప్పుకోవాలి (3:15). "బుద్ధి చెప్పుకొనుడి" అనే మాటకు ఉపయోగించబడిన గ్రీకు పదం (పారాకాలియో) అర్థం, మంచి ప్రవర్తన అలవర్చుకోడానికి ఒక వ్యక్తిని బతిమిలాడుట.

**ఇ) మూడవ ప్రమాదం – వినుటలో మందత్వము (Peril of dull hearing) (5:11–14) :**

వాక్యంపట్ల ఆసక్తి లేకపోవడం (5:11) పరిపక్వత లేకపోవడం (5:12) ఈ ప్రమాదం యొక్క లక్షణాలు. విశ్వాసులలో ఏర్పడే ఒక విధమైన ద్వంద స్థితి ఇది. ఎంతో కాలంగా క్రైస్తవులుగా ఉన్నారు. కాని అందుకు తగినట్లు పరిణతి చెందడం లేదు. వారు

నేర్చుకోవలసినవెన్నో ఉన్నాయి. నేర్పించే వారు కూడ ఉన్నారుగాని వారు వినడానికి మందులైనందువల్ల చెప్పడం కష్టమౌతుంది.

అనేక పర్యాయాలు చెప్పవలసినంత చెప్పలేదని బోధకులను గూర్చి తలస్తూ ఉంటాము. అది బోధకుల లోపం కాదుగాని వినేవారిని బట్టి అలా సిద్ధపర్చాల్సి వస్తుంది. అది చెప్పడంలోని సమస్యకాదు, వినడములో ఉన్న సమస్య. ఈ సమస్య ఈనాటి విశ్వాసులకు కూడ ఉంది. క్రీస్తు మెల్కీసెదెకు క్రమం చొప్పు యాజకుడయ్యాడన్న అంశాన్ని అర్థం చేసుకోవాలంటే స్పష్టమైన గ్రహణశక్తి ఉండాలి. నేటి విశ్వాసులలో అనేకులు శిశువులుగానే ఉన్నట్లు ఆనాటి విశ్వాసులలోను ఉన్నారు. అందును బట్టే బోధకులు వాక్యాన్ని ఖూనీ చెయ్యాల్సివస్తుంది, అనగా చెప్పాలను కొన్న దానికి బదులుగా చెప్పినదే మళ్ళీ చెప్పాల్సి వస్తుంది.

**ఈ) నాల్గవ ప్రమాదం – విడచివెళ్ళి పోయే ప్రమాదం (Peril of departing) (6:1–8) :**

ఈ భాగంలోని హెచ్చరిక ఎవరిని ఉద్దేశించి చేయబడిందన్నది చర్చనీయాంశం. ఈ పాఠకులను గూర్చి పలు అభిప్రాయాలున్నాయి.

1. వీరు రక్షించబడిన వారే గాని భయంకరమైన పాపం చేయడం వలన తమ రక్షణను కోల్పోయారు అని ఒక అభిప్రాయం. ఇదే నిజమైతే వారు తిరిగి రక్షణ పొందరని కూడ ఈ భాగం చెప్తుంది. ఇది శాశ్వత భద్రతను గూర్చిన సిద్ధాంతానికి వ్యతిరేకమైనది (రోమా 8:1, 35–39; యోహాను 10:28).
2. వీరు దేవుని విషయాలను కేవలం రుచి చూసారుగాని వాటిని పూర్తిగా జీర్ణించుకోలేని విశ్వాసులు అని మరో అభిప్రాయం. అయితే వారు అనుభవలముగలవారని, 6:5ను బట్టి తెలుస్తుంది. 2:9లో "ప్రతి మనుష్యుని కొరకు మరణము అనుభవించునట్లు" అనే మాటకు ఉపయోగించబడిన మాటనే 6:5లో కూడ ఉపయోగించబడింది. కనుక వీరు దేవుని విషయాలు బాగా తెలిసినవారని అర్థమౌతుంది.
3. ఈ పాఠకులు యోరూషలేము దేవాలయం నాశనం కాకముందు ఉన్న యూదా క్రైస్తవులు అని మరో అభిప్రాయం. రక్షణకు సమీపంగా ఉన్నా, పరిశుద్ధాత్మ ద్వారా ఒప్పించబడినా (యోహా 16:18–10) అల్ప విశ్వాసాన్ని బట్టి రక్షణ పొందని హెబ్రీయులకు గూర్చి ఈ మాటలు వ్రాయబడ్డాయని స్కోఫీల్డ్ బైబిలు వివరిస్తుంది. వీరు, కాదేషు బర్నెయా వద్ద, కానాను దేశాన్ని వేగుచూడడానికి పంపించబడిన మనుష్యులను పోలిన వారు. వారు ఆ దేశాన్ని, అందలి ఫలాలను చూసారు, చేతులతో పట్టుకొన్నారు గాని దానిలో ప్రవేశించడానికి వెనుకాడారు (ద్వితీ 1:19–26) అని ఒక అభిప్రాయం.
4. ఈ పత్రికలోని పాఠకులు పడిపోయారని, రక్షణ పోగొట్టుకొన్నందువల్ల అలా జరిగిందని చెప్పడం లేదుగాని ఒకవేళ వారు తప్పిపోతే అలా జరుగవచ్చునేమోనన్న ఉద్దేశంతో, గ్రంథకర్త హెచ్చరించాడని మరో అభిప్రాయం ఉంది. అయితే గ్రీకు తర్జుమాలో హెబ్రీ 6:6లో "ఒక వేళ" అన్న మాట వ్రాయబడలేదు.
5. హెబ్రీ పత్రిక గ్రంథకర్త వాస్తవంగా రక్షణను గూర్చి చర్చించడం లేదు గాని రక్షించబడిన వారిలో ఉండాల్సిన రక్షణ ఫలమును గూర్చి, మరియు అందుకు లభించే ప్రతి ఫలాన్ని గూర్చి వర్ణిస్తున్నాడన్నది అన్నిటికన్న సమంజసమైన అభిప్రాయం. ఎందుచేతనంటే ఈ పాఠకులు అవిశ్వాసులు కారు. వారు పాపంలో చచ్చిన స్థితిలో ఉన్నవారైతే (ఎఫె 2:1) వారికి జీవం అవసరం గాని పాలు కాదు. పాలు, బలమైన ఆహారం రక్షించబడ్డ వారికే కావాలి (హెబ్రీ 5:11). అయితే వారు ఆత్మీయంగా మారుమనస్సుకు తగిన ఫలాలు

ఫలించనప్పుడు పశ్చాత్తాపపడాలన్నదే ఈ భాగం వివరిస్తుంది. అందుకు భూమిని, దాని పంటను ఉదాహరణగా తీసికొన్నాడు (హెబ్రీ 6:7,8). భూమి తన మీద వర్షం కురిసినందుకు తగిన ఫలాన్నిస్తుంది. విశ్వాసులుగా, రక్షించబడి పరిశుద్ధాత్మ వర్షాన్ని పొందిన మనం అందుకు తగిన ఫలమిస్తున్నామా లేదా? (మత్త 3:8) లేనట్లయితే మారుమనస్సు పొందాలి. ఈ మారుమనస్సు రక్షణ పొందడానికి కాదు గాని విశ్వాసి ఫలమును గూర్చిన పశ్చాత్తాపం. ఈలాంటి పశ్చాత్తాపం, లేక మారుమనస్సు విశ్వాసులకు అవసరం (ప్రకటన2:5,16,21; 3:3). రక్షించబడిన వారి ఫలం సరిగా లేనట్లయితే ప్రతిఫలాన్ని పోగొట్టుకొనే ప్రమాదం ఉంది (1కొరి 3:11-15). రక్షించబడడానికి మంచి పనులు సహాయపడవు (యెష 64:6; తీతు 3:5) గాని రక్షించబడిన వారు మంచి పనులు చెయ్యాలి (తీతు 3:8). నీవు క్రైస్తవుడవైతే క్రైస్తవునికి తగినట్లు జీవించాలి.

ఉ. **ఐదవ ప్రమాద సూచన - వాక్యాన్ని తిరస్కరించే ప్రమాదం (Peril of despising) (10:26-31) :** ఇది అన్నిటికన్న గొప్ప భయాన్ని కలిగించే హెచ్చరిక (ప్రమాద సూచన) దేవుని చేతిలో పడడం భయంకరం (10:31). పాతనిబంధన ప్రకారం, ఎవరైనా మోషే ధర్మశాస్త్రాన్ని నిరాకరిస్తే వారిని కనికరించకుండ, సాక్షులమాటను బట్టి చంపేస్తారు. అలా అయితే పరిశుద్ధపర్చడానికి సాధనమైన క్రీస్తు రక్తాన్ని, కృపకు మూలమైన ఆత్మను తిరస్కరిస్తే ఎంత ఎక్కువైన శిక్ష విధించబడాలి? ఈ భాగంలోని మాటలు హెబ్రీ విశ్వాసులను గూర్చి వ్రాయబడ్డాయి. వారిలో అనేకులు మందిరానికి వెళ్తూనే ఉన్నారు. కొందరు తిరిగి బలులు అర్పించారు. వారు ఇంకా మోషే ధర్మశాస్త్రానికి కట్టుబడి ఉన్నామని యూదులకు చూపించుకోడానికి అలా చేసి ఉండవచ్చును. అలాంటి వారికి క్రీస్తు బలియాగం అర్థరహితమౌతుంది. వారికి తీర్పే మిగులుతుంది (2 పేతు 4:17,18).

ఊ. **ఆరవ ప్రమాదసూచన - దేవుని వాక్యాన్ని నిరాకరించుట (Peril of denying) (12:15-29) :** 12:15 లోని 'తప్పిపోవుట' అన్నది ఆత్మీయ భ్రష్టత్వాన్ని సూచించడం లేదు. ఈ భాగం, సాధారణంగా విశ్వాసులు పడిపోవడం గూర్చి చెప్పబడింది. ఒక్క విశ్వాసిలో చేదైన వేరు ఉంటే సంఘమంతటినీ చెరిపి వేస్తుంది. కనుక దానిని సహించే కృప కొరకు దేవుణ్ణి అడగాలి. అలాంటి వారి విషయం జాగ్రత్తగా ఉండాలి. ఈ భాగంలో, ఏశావు మారుమనస్సు పొందాలని కోరినా దేవుని క్షమాపణ పొందలేదని కొందరు అనుకొంటారు. కాని వాస్తవంగా ఏశావు తన జేష్ఠత్వాన్ని పోగొట్టుకొన్నాక దానితో పాటు రెండంతల ఆస్తిని కోల్పోయాడన్న సత్యాన్ని తెలిసికొని పశ్చాత్తాపపడ్డాడు. గాని ఆ ఆస్తిని తిరిగి పొందలేక పోయాడన్నది గమనార్హం. నేడు కూడ విశ్వాసులు దేవుని వాక్యంలోని విషయాలను నిర్లక్ష్యం చేయడం వల్ల, విసర్జించడం వలన అనేక ఆశీర్వాదాలను పోగొట్టుకొంటున్నారు (12:24,25). తిరిగి వాటి కోసం ఎంత వెదకినా, ప్రయాసపడినా ఫలితం శూన్యం. నూతనంగా మరిన్ని ఆశీర్వాదాలను సంపాదించుకోవచ్చును గాని పోగొట్టుకొన్నవి తిరిగి రావు. కనుక ఎంతో జాగ్రత్తగా ఉండాలి.

ప్రియ పాఠకులారా! హెబ్రీయులకు వ్రాయబడిన ఈ పత్రికలోని సందేశాలు, హెచ్చరికలు ఈ శతాబ్దంలో ఉన్న మనకు గొప్ప స్ఫూర్తినిస్తున్నాయనడంలోని ఏలాంటి సందేహం లేదు. క్రొత్త నిబంధనలో క్రీస్తును గూర్చి వివరించబడిన దానికన్నా ఆయనను తక్కువగా అంచనా వేయడం ఎక్కువగా ప్రబలుతున్న ఈ అంత్య దినాలలో హెబ్రీ పత్రిక ప్రత్యేక విలువను చేకూర్చగలదు. క్రైస్తవ విశ్వాసాన్ని గూర్చిన ప్రధాన సిద్ధాంతాలున్న ఈ పత్రికను చదివినప్పుడు పరలోక వాతావరణాన్ని ఆస్వాదిస్తాము. దాన్ని పఠించినపుడు ఆత్మీయంగా బలమైన మాంసాహారాన్ని భుజిస్తాము. అందలి బోధలలో నిలిచి ఉంటే పరిపక్వతలోనికి ఎదుగుతాము. పరిపూర్ణులవడానికి ముందుకు సాగిపోతాము.

# గొప్ప ప్రవర్తన

## యాకోబు పత్రిక సంగ్రహ సమీక్ష

**A. ఉపోద్ఘాతం :** క్రొత్త నిబంధనలోని పత్రికల విభాగంలో ప్రధాన రచయిత పౌలు. అతని పత్రికలన్నీ ప్రత్యేకించి కొంత మంది వ్యక్తులను మరియు సంఘాలను ఉద్దేశించి వ్రాయబడ్డాయి. మిగతా పత్రికలను "సార్వత్రిక పత్రికలు" అంటారు. యాకోబు పత్రిక, సార్వత్రిక పత్రికలో మొదటిది. ఇది సార్వత్రిక సంఘమంతటికి వర్తించే పత్రిక.

1. **గ్రంథకర్త :** యేసు సహోదరుడైన యాకోబు ఈ పత్రికను వ్రాసాడు (మత్త 13:55; మార్కు 6:3). యేసు ప్రభువు శిష్యులలో జెబెదయి కుమారుడైన యాకోబు, అల్ఫయి కుమారుడైన యాకోబు కూడ ఉన్నారు. గనుక ఏ యాకోబు ఈ పత్రికను వ్రాసాడన్న సందేహం కలగవచ్చు. జెబెదయి కుమారుడైన యాకోబు రాజైన హేరోదుచేత చంపబడ్డాడు. (అపొ. 12:1,2) తరువాత మరో యాకోబు ఆదిమ సంఘంలో మూలస్తంభముగా ఉన్నట్లు తెలుస్తున్నది (గల 2:9). ఇతడు ప్రభువు యొక్క సహోదరుడని పౌలు చెప్పాడు (గల 1:19). ఆదిమ సంఘంలో ప్రాముఖ్యమైన వ్యక్తిగా ఉన్న ఈ యాకోబే ఈ పత్రికను వ్రాసాడని స్పష్టమౌతున్నది.

2. **పత్రిక వ్రాయబడిన కాలం :** ఈ పత్రికలో సంఘము కూడుకొనే స్థలం సమాజ మందిరముగా ప్రస్తావించబడింది (2:2) గనుక సంఘం ఇంకా యూదామతస్థుల మధ్యనే ఉన్న కాలంలో వ్రాయబడిందని చెప్పవచ్చును. అంతమాత్రమే కాదు క్రొత్త నిబంధన గ్రంథాలలో మొదట వ్రాయబడిన గ్రంథం కూడ ఇదే. పై ఆధారాలను బట్టి యాకోబు పత్రిక క్రీ.శ. 45 సం॥ వ్రాయబడిందని చెప్తారు.

3. **యాకోబు వ్యక్తిగత జీవితం :** యేసు ప్రభువు పునరుత్థానానికి ముందు యాకోబు అవిశ్వాసిగా ఉన్నాడు (యోహాను 7:3-10). యేసు పునరుత్థానుడయ్యాక యాకోబుకు కూడ ప్రత్యక్షమయ్యాడు (1కొరింథి 15:7). ఆయన ఆరోహణమయ్యాక మేడగదిలో ప్రార్థించిన వారిలో, పరిశుద్ధాత్మను పొందిన వారిలో యాకోబు కూడ ఉన్నాడు (అపొ. కా. 1:14). పౌలు దమస్కు అనుభవం తరువాత మొదటి సారి యెరూషలేముకు వచ్చినపుడు యాకోబును కలిసాడు (గలతీ. 1:18, 19). పరిచర్య చివరలో కూడ యాకోబును కలిసాడు (అపొ.కా. 21:18-25). క్లిష్టమైన సిద్ధాంతపర సమస్యలను, పరిచర్యలోని ఇతర విషయాలను సమర్థవంతంగా పరిష్కరించడంలో యాకోబు నైపుణ్యత గలవాడు (అపొ.కా. 15:13; 21:18-24).

   ఇతడు తాను ప్రభువు సహోదరుడనని రక్తసంబంధాన్ని బట్టి గొప్పగా పరిచయం చేసుకోలేదుగాని ఆత్మీయ సంబంధాన్ని బట్టి తాను క్రీస్తు దాసుడని పరిచయం చేసుకొన్నాడు (యాకో 1:1). ఇతని గూర్చిన ఇతర వివరాలేమి తెలియవు కాని, యెరూషలేము నాశనం కాకముందు, అనేకమంది యూదులు క్రీస్తును అంగీకరిస్తున్న కాలంలో ప్రధాన యాజకుడైన అన్న, సన్ హెడ్రిన్ సభను సమావేశపరచి, యాకోబును పిలిపించి, క్రీస్తు ఇశ్రాయేలు యొక్క మెస్సీయా కాదని, బహిరంగముగా ప్రకటించమని ఆదేశించాడని, అందుకతడు అంగీకరించనందు వల్ల అతన్ని దేవాలయ శిఖరంపైనుండి క్రిందికి పడవేసారని, అయినా అతడు చనిపోనందువల్ల రాళ్ళతో కొట్టి చంపారని చెప్తారు.

4. **యాకోబు పత్రిక విశిష్టత :** ఈ పత్రిక పాతనిబంధనలోని ధర్మశాస్త్రము మరియు క్రొత్త నిబంధనలోని కొండమీది ప్రసంగం యొక్క కలయిక అని, యేసుక్రీస్తును గూర్చిన విషయాలను ఈ పత్రికలో నుండి తీసివేస్తే ఇది పాత నిబంధన ప్రామాణిక గ్రంథాలలో చేర్చబడి ఉండేదని, యం.ఎఫ్. అన్గర్ వ్రాసాడు.

ఈ పత్రికను క్రొత్త నిబంధనలోని యూదుల పుస్తకం అని, కొత్త నిబంధనలోని సామెతల గ్రంథం అని కూడ అంటారు. ఈ పత్రికలో గ్రీకు శైలి చాల ఉన్నతమైనది, నాణ్యతగలది. ఇందులో పాత నిబంధనలోని 4 వచనాలు మాత్రమే ప్రత్యక్షంగా చెప్పబడినా, కనీసం 53 వచనాలైనా ప్రస్తావించబడ్డాయి. యేసుప్రభువు లాగే యాకోబు కూడ పాత నిబంధనలోని వ్యక్తులను (2:21, 25; 5:11, 17) మరియు ప్రకృతిలో ఉన్న వాటిని సాదృశ్యంగా తీసుకొని ఆత్మీయ సత్యాలను వివరించాడు (1:6, 10:1; 3:5, 11, 12, 18; 5:7, 17).

**5. ముఖ్యాంశం :** వాక్యానుసారమైన జీవితం (1:22) మరియు క్రియలతో కూడిన విశ్వాసం (2:26). యాకోబు వ్యక్తిగతంగా ఆచరణాత్మకమైన వ్యక్తి. కనుక ఆచరణాత్మక విషయాలకే, ప్రాధాన్యతనిచ్చినా, విశ్వాసమునకు భిన్నంగా లేక వేరుగా ఏమి చెప్పలేదు. యాకోబు పత్రిక అంతా, క్రైస్తవ నీతి శాస్త్రాన్ని బోధిస్తుంది. అందుకే ఇది సామెతల గ్రంథానికి, కొండమీది ప్రసంగానికి పోల్చబడింది.

## B. యాకోబు పత్రిక విభజన :

| | | |
|---|---|---|
| **I** | **నిజమైన విశ్వాసము పరిశీలన** | **1-3 అధ్యా** |
| 1. | శ్రమల ద్వారా విశ్వాసము పరీక్షించబడుట | 1:1-12 |
| 2. | కీడు ద్వారా విశ్వాసము పరీక్షించబడుట | 1:13-21 |
| 3. | వాక్యం ద్వారా విశ్వాసము పరీక్షించబడుట | 1:22-27 |
| 4. | ఉద్దేశం మరియు ఆచరణ ద్వారా విశ్వాసము పరీక్షించబడుట | 2:1-13 |
| 5. | సత్క్రియల ద్వారా విశ్వాసము పరీక్షించబడుట | 2:14-26 |
| 6. | నాలుక (మాట) ద్వారా విశ్వాసము పరీక్షించబడుట | 3 అధ్యా |
| **II.** | **లోకానుసార స్థితిలోని బుద్ధిహీనత మరియు మందత్వం** | **4 అధ్యా** |
| **III.** | **ధనవంతులకు కలిగే శ్రమ - క్రీస్తురాకడ విలువ** | **5 అధ్యా** |

## C. అంశాల వారిగా విభజన :

యాకోబు పత్రికలో "సంపూర్ణమైన" అనే మాట ఎక్కువగా కనిపిస్తుంది. "టెలియోస్" అనే ఈ గ్రీకు పదానికి పరిపక్వత అని అర్థం. దీన్ని ఆధారం చేసుకొని పత్రికను ఈ విధంగా విభజించుకోవచ్చును.

**I. శ్రమల ద్వారా విశ్వాసి పరిపక్వత పొందుతాడు (1:1-20) :** మొట్టమొదట మనం శ్రమలను గూర్చి సరైన అవగాహన కలిగి యుండడం అవసరం.

పరీక్షల ద్వారా కలిగే శ్రమలు దేవుని నుండి వస్తాయి. ఇవి మనలో నుండి మంచిని బయటికి తీయడానికి మన మేలు కోసమే వస్తాయి. శోధనలనే శ్రమలు సాతాను కలుగజేసేవి. లోకాన్ని, శరీరాన్ని ఉపయోగించుకొని వాడు కలిగించే ఈ శోధనలు మనలోని చెడును బయటికి తీసుకొని వస్తాయి. ఈ రెండు శ్రమలు కూడ ఒకే నాణెం యొక్క ఇరుపార్శ్వాలు. విశ్వాసి జీవితంలో దేవుడు మరియు సాతాను ఒకే సంఘటన ద్వారా శ్రమలు కలుగజేసినా, ఒకరు శుద్ధీకరించడానికి మరొకరు విశ్వాసం నుండి తొలగించడానికి పనిచేస్తారు.

**1. శ్రమల లక్షణాలు :** శ్రమలు విశ్వాసికి తప్పనిసరిగా వస్తాయి (1:2). ఒక వేళ మీ విశ్వాసానికి పరీక్ష కలిగితే అని యాకోబు వ్రాయలేదు. పరీక్ష వస్తుందని వ్రాసాడు. శ్రమలు కొన్ని పర్యాయాలు అకస్మాత్తుగా కూడ రావచ్చును. ఇవి పలు విధాలుగా ఉంటాయి. నానా విధములైన శోధనలలో పడునప్పుడు అని వ్రాయబడింది (1:2,3). అవి భౌతికమైనవి. మానసికమైనవి, ఆధ్యాత్మికమైనవి లేక సాంఘీక సమస్యలు కావచ్చును.

**2. శ్రమల ఉద్దేశం :** దేవుడు మనల్ని కష్టపెట్టాలని శ్రమలను అనుమతించడు. దేవుడు అన్నీ మంచి ఉద్దేశంతోనే మన మేలు కొరకు చేస్తాడు (రోమా 8:28). శ్రమల ద్వారా ఓర్పు

వస్తుంది. ఆ ఓర్పే మనల్ని సంపూర్ణులుగా చేస్తుంది (1:4). ఓర్పు లేక సహనం అన్నది ఆత్మఫలంలో ఒకటి. ఇది స్వయంగా రాదు. శ్రమల ద్వారానే వస్తుంది. ఇది ఈ లోక జీవితంలో పొందే ప్రతిఫలం. శ్రమల ద్వారా పరలోకంలో కూడ ప్రతి ఫలం లభిస్తుంది. (1:12) శ్రమలు విశ్వాసికి అంతం కాదు. భవిష్యత్తులో మహిమకు కారణమౌతాయి.

3. **శ్రమలలో విశ్వాసి వైఖరి :** శ్రమలలో విశ్వాసి ఎలా ప్రతిస్పందించాలో యాకోబు చక్కగా వివరించాడు.

ఎ) కష్టాలు, శ్రమలు వచ్చినప్పుడు దేవుడు మనల్ని పరీక్షిస్తున్నాడని సంతోషించాలి. అనగా దేవునితో సమాధానపడని విషయాలలో సమాధానపర్చబడాలి. శ్రమలలో సంతోషంగా లేమంటే దేవునితో సమాధానపడలేదని అర్థం.

బి) చాలమంది దేవుని చిత్తానికి లోబడుతున్నామంటారు కాని దుఃఖముఖులుగా ఉంటారు. శ్రమలను అనుమతించడంలో దేవునికి ఒక లక్ష్యం ఉంది. దాన్ని గుర్తించి దేవుని చిత్తంలోనికి వస్తే సంతోషిస్తాం.

సి) శ్రమలు సమస్యలు వచ్చినప్పుడు వాటిని పరిష్కరించుకొనే జ్ఞానం నిమిత్తం ప్రార్థించాలి (1:5) సందేహించవద్దు, ద్విమస్కులుగా ఉండవద్దు (1:6,7). నీ సమస్యలు నీవే పరిష్కరించుకోవాలనుకొంటే దేవుడు ఏమి చెయ్యలేడు. ద్విమనస్కుడు తన మార్గంలో అస్థిరుడు (1:8).

4. ఇక శోధన విషయానికొస్తే, ప్రతి మనుష్యుడు ఏదో ఒక విషయంలో తప్పకుండా శోధించబడతాడు. అయితే శోధన ఎలా కలుగుతుందో తెలిసికోవడం ప్రాముఖ్యం. దేవుడు కీడు విషయం శోధించడు. సాతాను కీడు విషయం శోధించినా, మనలో ఉన్న స్వకీయ దురాశలను బట్టే శోధిస్తాడు. కనుక శోధనలకు మూలకారణం మానవుని హృదయంలోని దురాశలే అన్నది సుస్పష్టం. "ప్రతివాడును తన స్వకీయమైన దురాశచేత ఈడ్వబడి మరులుకొల్పబడినవాడై శోధింపబడును" (1:14). శోధించబడడం పాపంకాదు. దాన్ని గర్భం ధరించి కార్యరూపం దాలిస్తే శోధన పాపానికి దారి తీస్తుంది (1:15). స్త్రీ పురుషుల ఐక్యత వలన గర్భధారణ కలిగినట్లే బాహ్య శోధనకు మన అంతరంగ ప్రాచీన స్వభావం జత కలిస్తే పాపాన్ని గర్భం ధరిస్తుంది. ఈ పాపం మరణాన్ని కంటుంది. అనగా దేవుని నుండి వేరు చేస్తుంది.

**II. దేవుని వాక్యాన్ని పఠించడం ద్వారా విశ్వాసి పరిపక్వత నొందుతాడు (1:17, 18, 21, 25) :**

దేవుని వాక్యం యొక్క ప్రాధాన్యతను ఈ భాగం వివరిస్తుంది. దేవుడు ఈ సత్యవాక్యం ద్వారానే మనల్ని కన్నాడు (1:8). ఒక వ్యక్తి వాక్యాన్ని విన్నప్పుడు అతని చిత్తం దేవుని చిత్తంతో కలసినపుడు రక్షించబడతాడు (1 పేతురు 1:23). వాక్యము, లోపల నాటబడి, ఆత్మలను రక్షించడానికి శక్తిగలది (1:21). ఈ మాటలు రక్షించబడినవారికే వ్రాయబడ్డాయి. విశ్వాసి రక్షణ మూడు కాలాలకు సంబంధించినది. దేవుని వాక్యం ద్వారా రక్షణ కార్యం జరిగింది. అయితే ప్రస్తుతం నీవు క్రైస్తవ జీవితం జీవించాలి. అందుకు వాక్యాన్ని సాత్వికంతో అంగీకరించాలి. బైబిలు నిన్ను పాపానికి దూరంగా ఉంచుతుంది. పాపం నీపై ఏలుబడి చేస్తే, అది నిన్ను వాక్యానికి దూరంగా ఉంచుతుంది. జాగ్రత్త. యాకోబు పత్రికలోని ఈ భాగం. విశ్వాసి తన ప్రస్తుత రక్షణను దేవుని వాక్యం ద్వారా కొనసాగించాలని జ్ఞాపకం చేస్తుంది.

దేవుని పిల్లలు వాక్యానికి వేరుగా, దూరంగా జీవించలేరు. ప్రతి బిడ్డ, తన తండ్రి స్వరాన్ని వినాలని కోరతాడు. అది ఆదరణ మాటైనా, హెచ్చరిక మాటైనా సరే. వాక్యం పట్ల ఆసక్తి లేనివారు సమస్యలో చిక్కుకొంటాడు. ఈనాడు అనేక తర్జుమాల బైబిళ్ళు అందుబాటులో ఉన్నాయి. ఏ తర్జుమా బైబిలు చదివినా దాని ప్రకారం ప్రవర్తించే జీవితమనే తర్జుమానే

లోకం చూస్తుంది (1:22-24). ఈ మాటలనే పౌలు స్వల్ప మార్పుతో ఇలా వ్రాసాడు. “మా హృదయముల మీద వ్రాయబడి యుండి, మనుష్యులందరు తెలసికొనుచు చదువుకొనుచున్న మా పత్రిక మీరేకారా? (2 కొరింథి 3:2,3). ఈ దినాలలో లోకం బైబిలును చదవడం లేదు గాని క్రైస్తవులనే చదువుతున్నారు. మనం చేస్తున్న పనులు, చెప్తున్న మాటల ద్వారా, క్రీస్తు సువార్త ప్రతి రోజు ఒక అధ్యాయం వ్రాయబడుతూనే ఉంది, ప్రజలు దాన్ని చదువుతూనే ఉన్నారు. ఇంతకూ నీ సువార్త ఏంటి? ప్రశ్నించుకో.

యాకోబు 1:22-25 లో దేవుని వాక్యం మనల్ని కార్యాచరణ కోరుతున్నది. దేవుడు అవిశ్వాసులను, వారి కోసం తాను చేసిన రక్షణ కార్యాన్ని విశ్వసించాలని కోరుతున్నాడు గాని విశ్వాసులనైతే, వారి రక్షణకు తగినట్లు జీవించాలని కోరుతున్నాడు. వాక్యాన్ని హృదయంలోకి తీసుకొనే వారు కొద్దిమందే. అలాంటి అంతరంగిక ప్రేరణగలవారే విన్నదాని ప్రకారం జీవించగలుగుతారు. అలా చెయ్యనివారు తమ్మును తామే మోసపుచ్చుకొంటున్న ప్రమాదంలో ఉన్నారు (1:23, 24). వాక్యం అద్దంలాంటిది. నీవు ఏమైయున్నావో నీతో చెప్తుంది. నీవు నీ నిజ స్థితిని తెలిసికొని కూడ అలాగే వదిలేస్తే ప్రమాదం.

**III. నిజాయితీ, విశ్వాసిని పరిపక్వత నొందిస్తుంది (2:1-13) :** ఈ భాగంలో నిజాయితీ లేకపోవడానికి మూలకారణమైన పక్షపాతాన్ని గూర్చి (2:1:8) మరియు నిజాయితీ లేనందువల్ల కలిగే ఫలితాన్ని గూర్చి (2:9-13) వ్రాయబడింది. పేదల పట్ల దేవునికి గల ప్రత్యేక శ్రద్ధ ఈ వాక్యభాగంలో మాత్రమే కాక ఆదికాండం నుండి ప్రకటన గ్రంథం వరకు పలుమార్లు స్పష్టం చేయబడింది. సృష్టి ప్రారంభం నుండి, పేద మరియు ధనికవర్గం రెండూ ఉన్నాయి. లోకంలో ప్రకృతి సంబంధమైన మనుష్యుల వలన పేదలకు న్యాయం జరుగదు. ఏ రాజకీయ పార్టీలు వారికి సహాయం చేయలేవు. ధనవంతులు పేదలను అణగద్రొక్కడం, వారిని అన్యాయంగా తీర్పులోనికి లాగడం తరతరాలుగా జరుగుతున్న విషయమే. అయితే వారి నిరీక్షణ క్రీస్తు ఒక్కడే (యోబు 5:15; 36:15; కీర్త 9:18; 68:10; 69:33; 72:12, 13; 102:17; యెష 11:4). దేవుడు మన విశ్వాసాన్ని, మనుష్యుల పట్ల మన వైఖరిని బట్టి మరియు మన చర్యలను బట్టి పరీక్షిస్తాడు. యాకోబు 2:1-3లో సమాజంలోని పలురకాల ప్రజలతో ఎలా నడచుకోవాలో వ్రాయబడింది. యేసు క్రీస్తును గూర్చిన విశ్వాస విషయంలో పక్షపాతం ఉండకూడదు. విశ్వాసం విషయంలో పేద, గొప్ప అనే తేడాలు లేవు. ధర్మశాస్త్రం కూడ అదే నేర్పిస్తుంది. (లేవీ 14:15). దేవుడు పక్షపాతికాడు. ఆనాడు సమాజ మందిరాలలో చేసినట్లే ఈనాడు కూడ దేవుని మందిరాలలో పక్షపాతం చూపించబడుతుంది. ఎక్కువ అడంబరంగా కనిపించే వారికి, ధనికులకు, ఎక్కువ విరాళాలిచ్చే వారికి ప్రత్యేక స్థానాలు ఏర్పాటు చేస్తారు. పేదలు సంఘాలలో అవమానపర్చబడవచ్చును. కాని దేవుని దృష్టిలో ఆత్మీయంగా వారే గొప్పవారు.

పేదలను చిన్న చూపు చూడడం, క్రీస్తునామాన్ని దూషించడమేనని యాకోబు స్పష్టం చేస్తున్నాడు (2:8). విశ్వాసులుగా దేవుణ్ణి సంతోషపర్చాలంటే ఆయనకు లోబడాలంటే, నిన్నువలె నీ పొరుగు వారిని ప్రేమించాలి. ఈ ఆజ్ఞ తప్పిపోతే ఆజ్ఞలన్నీ తప్పినట్లే. ఇది స్వాతంత్ర్యమునిచ్చే నియమం. క్రీస్తునియమం (యోహాను 15:12; గలతీ 6:2). మనుష్యులందరూ మనలాంటివారే అన్న భావనే, వారిపట్ల కనికరాన్ని పుట్టిస్తుంది. కనికరం చూపనివారు కనికరంలేని తీర్పు పొందుతారు (2:13).

**IV. క్రైస్తవ పరిచర్య (సత్క్రియల) ద్వారా విశ్వాసి పరిపక్వత నొందుతాడు (2:14-26) :**

ఈ భాగం అనేకులలో విభిన్న, అసమంజసమైన అభిప్రాయాలను పుట్టిస్తుంది. యాకోబు పౌలుకు వ్యతిరేకంగా వ్రాసాడా? అన్న సందేహం రాకమానదు. ఈ పత్రికలో యాకోబు

మూలాంశం, క్రియలు కాదుగాని విశ్వాసమే. పౌలు పత్రికలలోని మూలాంశం కూడా అదే. పౌలు, విశ్వాసం ద్వారానే నీతిమంతులుగా తీర్చబడతామని మన క్రియల వలన కాదని స్పష్టం చేసాడు (ఎఫెసీ 2:8,8; తీతు 3:5). అయితే సత్క్రియలు చేయడానికే నీతిమంతులముగా తీర్చబడ్డామని కూడ వ్రాసాడు (ఎఫెసీ 2:10; తీతు 3:8). యాకోబు, విశ్వాసం ద్వారా అనగా రక్షణ ద్వారా ఉత్పత్తి అయ్యే క్రియలను గూర్చి చెప్పాడు. పౌలు రక్షణకు మూలమైన విశ్వాసాన్ని గూర్చి, యాకోబు రక్షణ ఫలమైన క్రియలను గూర్చి నొక్కి చెప్పారు. పౌలు ధర్మాశాస్త్ర క్రియల వలన రక్షణ లభించదన్నాడు. యాకోబు ధర్మశాస్త్ర క్రియలను గూర్చి కాక, రక్షించబడిన వారిలోని విశ్వాసపు క్రియలను గూర్చి చెప్పాడు.

మనకు విశ్వాసముందో లేదో దేవుడు మన హృదయాల్ని చూచి చెప్తాడు. కాని మన పొరుగు వారు దాని ఫలమును (క్రియలను) బట్టి మనకు తీర్పు తీరుస్తారు. మరో విధంగా చెప్పాలంటే, ఒక విశ్వాసి క్రైస్తవ పరిచర్యను గూర్చి అతని మాటలు, క్రియలు మరియు నడత ద్వారా చూపించనంత వరకు అతడు మనుష్యుల దృష్టిలో పాపిగానే ఉంటాడు. జీవము గల విశ్వాసం ఏదో ఒక దానిని ఉత్పత్తి చేస్తుంది. దానిని బట్టే మనం యేసు శిష్యులమని గుర్తించబడతాం. విశ్వాసము ఫలాన్నిస్తుంది. గనుక అలాంటి ఫలము నియ్యని, అనగా క్రియలు లేని విశ్వాసం మృతం (2:17,20,26).

క్రియాపూర్వకమైన విశ్వాసాన్ని గూర్చి వివరించడానికి యాకోబు, పాతనిబంధన నుండి అబ్రాహామును మరియు రాహాబును సాదృశ్యంగా తీసుకొన్నాడు. అబ్రాహాము, దేవుడు తన కుమారున్ని బలినిమ్మంటాడని అనుకోలేదు. కాని దేవుడు ఇవ్వమన్నాడు గనుక కత్తినెత్తాడు. ఒక వేళ దేవుడు అడ్డుకోకుంటే తప్పకుండా చంపేవాడే. తన కుమారుణ్ణి చంపినా, దేవుడు తిరిగి లేపుతాడన్న విశ్వాసం అతన్ని నీతిమంతునిగా చేసింది (హెబ్రీ 11:17-19). అబ్రాహాము 85 సం॥ల వయస్సులో దేవున్ని నమ్మడం ద్వారా దేవుని దృష్టిలో నీతిమంతునిగా ఎంచబడ్డాడు (అది.కా. 15:6; 16:16, 4:3). అయితే మనుష్యులముందు సుమారు 137 సం॥ల వయస్సులోఅతడు చేసిన క్రియను బట్టి నీతిమంతునిగా ఎంచబడ్డాడు (ఆది.కా. 22:1-14; 23:1). ఇక రాహాబు విషయానికొస్తే ఆమె విశ్వాసం ద్వారా రక్షించబడడం గూర్చి యెహోషువ 2:1-14లో వ్రాయబడింది. ఆ రక్షణను బట్టి ఆమె చేసిన పరిచర్య (క్రియలను) గూర్చి 2:15, 16లో వ్రాయబడింది. ఫలదీకరణలేని విశ్వాసం సరైనది కాదు గనుక ఆ విశ్వాసం ఒక వ్యక్తిని రక్షించదు. విశ్వాసం మరియు క్రియలు అన్నవి పరలోకానికి వేళ్ళేందుకు ద్విముఖ ప్రవేశ పత్రంలాంటిది. కేవలం క్రియలే పరలోకంలో ప్రవేశించడానికి అర్హం కావు, అలాగే క్రియలు లేని విశ్వాసానికి విలువలేదు.

## V. సరైన బోధ పరిపక్వమైన వ్యక్తులనుగా చేస్తుంది (3:1-18) :

దేవుని లోకంలో వాక్ స్వాతంత్రాన్ని గూర్చి ఈ భాగం చెప్తుంది. మనం మాట్లాడే దానికన్నా రెట్టింపు వినాలని దేవుడు ఒకే నోరును, రెండు చెవులను ఇచ్చాడు (యాకో 1:19). పుట్టిన బిడ్డ మాటలు నేర్చుకోడానికి కనీసం రెండు సంవత్సరాలైనా పడుతుంది. కాని నోరు మూసుకోవడం నేర్చుకోవడానికి 50 సంవత్సరాలైనా పడుతుంది.

నీ నోటినుండి ఇంకా వెలువడని మాటలు నీ అదుపులో ఉన్నాయి. వాటిపై నీవే యజమానివి. కాని బయటికి వెలువడిన మాట నిన్ను అదుపులో ఉంచుతుంది. ఒకసారి నీవు పలికాక అది నీ అదుపులో ఉండదు. కనుక నీవు ఎవరితో మాట్లాడుతున్నావు, ఎవరిని గూర్చి, ఎలా, ఎప్పుడు, ఎక్కడ మాట్లాడుతున్నానన్నది జాగ్రత్తగా గమనించుకో. యాకోబు 3:1, బోధకుని గొప్ప బాధ్యతను జ్ఞాపకం చేస్తుంది. తప్పు బోధిస్తే ప్రమాదం. బోధించడానికి ఎంత అవకాశం ఇవ్వబడితే అంతగా బాధ్యత అప్పగించబడుతుంది.

ఈ అధ్యాయంలో నాలుక యొక్క ప్రాముఖ్యత (3:2), నాలుకను గూర్చిన సాదృశ్యాలు (3:3,4) నాలుక చేసే పాపం (3:5,6) నాలుక యొక్క సరిచేయబడని స్థితి (3:7) దాని అస్థిరత్వం (3:9-12) గూర్చి, మరియు దాని ఫలితాలను గూర్చి (3:13,17,18) వ్రాయబడింది.

అయితే రక్షించబడిన వ్యక్తి, విమోచించబడిన శరీరం గలవాడు గనుక పునరుజ్జీవింపబడిన నాలుక కలిగి ఉంటాడు. ఈ నాలుక దేవుని చేత సాధుచేయబడి, ఆయన కొరకు వాడబడుతుంది. పరిశుద్ధాత్మను పొందక ముందు యేసును ఎరుగనని బొంకిన పేతురు నాలుక, పెంతెకొస్తు దినాన సాధుచేయబడి, దేవుని కొరకు ఎంత శక్తివంతంగా వాడబడిందో గమనించగలం. మనిషి తన భావాలను, ఆలోచనలను మాటల రూపంలో పెట్టుట ద్వారా తన్నుతాను ప్రత్యక్షపరచుకొంటాడు. నాలుక విశ్వాసి జీవిత విషయ సూచిక. మన జీవితాంశాల జాబితాను మరియు మనమేమైయున్నామో మన నాలుకనే చెప్తుంది. "నీ పలుకు నిన్ను గూర్చి సాక్ష్యమిచ్చుచున్నది" (మత్త 26:73)

"నిర్లక్ష్యపుమాట బాధకలిగిస్తుంది
కఠినమైన మాట జీవితాన్ని బద్దలు చేస్తుంది
ద్వేషపూరిత మాట ద్వేషాన్ని రగిలిస్తుంది
క్రౌర్యమైన మాట శిక్షిస్తుంది. చంపుతుంది"
దయగల మాట మార్గాన్ని సరాళం చేస్తుంది
సంతోషకరమైన మాట దినాన్ని వెలుగుమయం చేస్తుంది
సమయోచితమైన మాట వత్తిడిని తగ్గిస్తుంది.
ప్రేమగల మాట స్వస్థపరుస్తుంది, దీవిస్తుంది.

**VI. దేవునికి అప్పగించుకోవడం వలన పరిపక్వత నొందుతాము (4:7) :** 4వ అధ్యాయంలో లోకానుసారమైన జీవితం యొక్క అజ్ఞానస్థితిని, నిస్సార స్థితిని గూర్చి యాకోబు వర్ణించాడు. లోకానుసారమైన జీవితం అంటే ఏంటి? డబ్బు గడించాలన్న మనస్సు కలిగి సంఘ సహవాసాన్ని నిర్లక్ష్యం చేయడం, ఇతర కాలక్షేపాలు, పరిసర ప్రభావాలకు లోనవడం మొదలైన బాహ్య విషయాలే లోకానుసార జీవితం కాదు. ఇవన్నీ హృదయంలోని వ్యాధికి బాహ్య చిహ్నాలు మాత్రమే. ఈనాడు సంఘం లోకానుసారంగా మారడానికి కారణం స్వకీయ దూరాశలే (4:1). వీటిని బట్టే పోరాటాలు, కక్షలు సమస్యలు ఏర్పడుతున్నాయి. లోకానుసారమైన జీవితంలో శరీరం (4:1-3), లోకం (4:4,5) మరియు సాతాను (4:6,7) ఇమిడి ఉన్నాయి. వీటిని తప్పించుకొవాలంటే మరియు దేవుని కృపను, (4:6) నడిపింపును (4:13-15) మంచితనాన్ని (4:10) పొంది ఆనందించాలంటే దేవునికి లోబడాలి. అందుకు యాకోబు చెప్పిన సూత్రం చాల సులువైనది. మనస్వంత కోరికల కోసం పోట్లాడడం కన్న దేవుణ్ణి అడగాలి. ప్రార్థనలో మన కోరికలను దేవుని దగ్గరకి తీసుకొని వెళ్ళాలి. మనం తృప్తి పర్చబడడం ద్వారా లేక, శుద్ధీకరించబడడం ద్వారా ఆయన జవాబును పొందుతాము. లోకానుసారమైన మనస్సుకు నివారిణి ప్రార్థన, హృదయంలోని కక్ష, క్రోధాన్ని తీసివేయగల సాధనం ప్రార్థన. మన కోరికల లక్ష్యసాధన కోసం లోకంతో రాజీపడడాన్ని యాకోబు వ్యభిచారంగా పరిగణిస్తున్నాడు (యాకోబు 4:4). అయితే దేవునికి అప్పగించుకొని లోబడినపుడు లోకాన్ని, శరీరాన్ని, అపవాదిని ఎదిరించగలుగుతాము. వాణ్ణి ఎదిరించడమంటే వానికి వ్యతిరేకంగా పని చేయడమే. విశ్వాసి పాపాన్ని తేలికగా తీసుకోవద్దు. పాపం గూర్చి విలపించాలి. వ్యాకులం చెందాలని యాకోబు హెచ్చరించాడు (4:9,10). అలాగే ఇతరులతో గల సంబంధం విషయంలో నీవు తీర్పరి స్థానాన్ని తీసుకోవద్దు (4:11,12) లోకానుసారమైన మనస్సులో భవిష్యత్తును గూర్చిన చింత కూడ

ఒకటి (4:13-15). విశ్వాసులు భవిష్యత్తును గూర్చి లేక ఆత్మీయ విషయాలను గూర్చి ప్రణాళిక వేసుకోవద్దని ఈ భాగం చెప్పడం లేదు. దైవ చిత్తానుసారమైన వాటికోసం ప్రణాళిక కలిగి ఉండడం తప్పుకాదు. సృష్టిలో ప్రతి ఒక్కటి ఓ ఉద్దేశంతో చేయబడింది. దేవుని ఉద్దేశాన్ని తెలుసుకోవాలి. ఎందుచేతనంటే మనిషి జీవితం తాత్కాలికమైంది, అల్పమైంది. దేవుడు లేకుండ జీవించే జీవితం అపజయం పాలు అవుతుంది, వ్యర్థమౌతుంది.

**VII. స్వసమర్పణ పరపక్వమైన వ్యక్తులుగా చేస్తుంది (5:1-6) :** ఈ భాగం యాకోబు జీవించిన కాలంనాటి ఆర్థిక వ్యవస్థను, ప్రజలలో ఉన్న వర్గాలను ఉద్దేశించి వ్రాయబడింది. ఆ కాలంలో ధనిక వర్గం, పేదవర్గం మాత్రమే ఉన్నారు. క్రైస్తవులైన వారిలో అధికభాగం పేదలు, బానిసలే. అన్యాయంతో నిండిన ఈ లోకంలో విశ్వాసుల వైఖరి ఎలా ఉండాలో యాకోబు వ్రాసాడు. ధనవంతుల దృష్టిలో ధనం అనైతికం కాదు, నీతి కూడ కాదు. యాకోబు ధనవంతులుగా ఉండకూడదని ఖండిచడం లేదు గాని ధనంతో వారికున్న సంబంధం సరైనది కాదని ఖండించాడు. ధనం అన్నది సమస్య కాదు గాని వారి హృదయంలోని ధనాపేక్షనే అసలైన సమస్య. ధనార్జనకై వారు అవలంబించే విధానాలు, దాన్ని వినియోగించే విధానాలు వాక్యానికి వ్యతిరేకంగా ఉన్నాయి (5:3-6). ఎలా సంపాదించాలో అన్నదే కాక, ఎలా వినియోగించాలన్నదానికి, దేవుడు మనిషిని బాధ్యునిగా ఎంచుతాడు. ధనాపేక్ష తృప్తినివ్వదు. ఇంకా సంపాధించాలన్న దాహాన్ని పెంచుతుంది. అందుకు అన్యాయం కూడ చేస్తారు (5:4). ఎంత సంపాదించినా కడుపు నిండేంత వరకే తినగలం, ఒక జత దుస్తులే వేసుకోగలం. కనుక దాచి ప్రయోజనం లేదు. ధనాన్ని వినియోగించడానికే దేవుడు ఇచ్చాడు. గాని బిగబట్టుకోడానికి, దురాశ పెంచుకోడానికి కాదు. అదంతా తుప్పు పడుతుంది. వాటి తుప్పు వారిపై స్యాక్ష్యంగా ఉంటుంది. చివరికి తీర్పులోనికి వస్తారు. బహుశా భవిష్యత్తులో యెరూషలేముపై రానున్న ఉపద్రవాన్ని దృష్టిలో ఉంచుకొని యాకోబు హెచ్చరించి ఉంటాడని కొందరి అభిప్రాయం. క్రీ.శ. 70 సం॥ యెరూషలేము నాశనం చేయబడినపుడు పేదలతో పాటు ధనికులు కూడ చంపబడ్డారు. మరణం ధనవంతుల్ని వారి ధనం నుండి వేరు చేస్తుంది. అది వారి వెంట రాదు. తుప్పుపట్టడం అంటే అదే. విశ్వాసులు ఈ విషయాలను దృష్టిలో ఉంచుకొని స్వసమర్పణ చేసుకొంటే ఆత్మీయంగా పరిపక్వత నొందుతారు. (1 తిమోతి 6:6-8; 6:17-19).

**VIII. సహనము కలిగియుండుట వలన పరిపక్వత నొందగలము (5:7-11) :** ఈ భాగం విశ్వాసులైన పేదవారిని దృష్టిలో ఉంచుకొని వ్రాయబడింది. పేదలకు ఈ లోకంలో ఉన్న ఒకే ఒక ఆదరణ క్రీస్తు రాకడ. యేసుక్రీస్తు తన నీతి రాజ్య స్థాపన చేసినపుడు పేదలకు నీతిని బట్టి న్యాయం తీరుస్తాడు (యెషయా 11:4). ఇది చరిత్రలో కని విని ఎరుగని సంగతి. రాజకీయ పార్టీలు, మారుతున్న ప్రభుత్వాల వల్ల పేదలకు న్యాయం జరుగదు. మన నిరీక్షణ యేసులోనే ఉంది. ఆయన ఒక్కడే నిరీక్షణాధారం కనుక ఆయన కొరకే సహనంతో కనిపెట్టాలి. యేసు రాక, చెడ్డవాటిని మంచిగా మారుస్తుంది.

ఈ విషయాన్ని వివరించడానికి యాకోబు, గతం నుండి ప్రవక్తలను, యోబును (5,:10,11) ప్రస్తుతం నుండి వ్యవసాయకుణ్ణి (5:7) భవిష్యత్తు నుండి, త్వరలో రానున్న న్యాయాధిపతిని (5:8,9) ఉదాహరణగా తీసుకొన్నాడు. మన న్యాయాధిపతియైన క్రీస్తు ఎంతో జాలి కనికరం గలవాడు (5:11బి).

**IX. విజ్ఞాపన ప్రార్థన పరిపక్వతనొందిస్తుంది (5:12-18) :** ప్రార్థనకు ఫలితం పొందడానికి 5:14-16 వచనాలు లక్ష్యంగా ఉన్నాయి. ఈ భాగం స్వస్థత ప్రార్థనను గూర్చిన సరైన వివరణ నిస్తుంది. ప్రార్థించినపుడు ప్రతి ఒక్కరు స్వస్థత పొందుతారని ఈ భాగం చెప్పడం లేదు. అలా అయితే రోగులెవరూ చావరు. అయితే స్వస్థత అన్నది రోగికి దేవుని పట్లగల విశ్వాసాన్ని బట్టి, దేవునితో సంబంధాన్ని సరిచేసుకోవడం బట్టి, మరియు దేవుని చిత్తాన్ని

బట్టే లభిస్తుంది. నూనె రాచి ప్రార్థించడం అంటే రోమన్ కాథొలిక్కులు, మరణశయ్యపైనున్న వ్యక్తికి ఇచ్చే అభిషేకం కాదు. లేక ఒక వ్యక్తిని పాతిపెట్టడానికి సిద్ధం చేయడం కోసం కాదు గాని తిరిగి సమకూర్చేందుకు ఉద్దేశించబడింది. గ్రీకు భాషలో ఒలీవనూనె అనే వ్రాయబడింది. ఇది తూర్పు ప్రాచ్యదేశాలలో సాధారణంగా వైద్యపరంగా రోగనివారణ కోసం వాడబడేది (యెష 1:6; లూకా 10:34). యేసు శిష్యులు కూడ రోగులకు నూనె రాచి ప్రార్థించేవారు (మార్కు 6:13). ఈనాడు కూడ నూనెలో స్వస్థత గుణం ఉన్నది. అయితే స్వస్థతలో, నూనె కన్న విశ్వాసం ప్రధానమైనది, నూనె కేవలం దేవుని అద్భుతకార్యానికి సూచనగా ఉందని యాకోబు ఉద్దేశం.

నూనె కాదుగాని ప్రభువే అతన్ని లేపుతాడు (5:15). అయితే ఒక వ్యక్తిలో దేవుని కార్యం జరగాలంటే ఆ వ్యక్తి దేవుని కొరకు తన్నుతాను ప్రత్యేకించుకోవాలన్నదే ఈ నూనె సూచిస్తుంది. అదే యాకోబు ప్రధానోద్దేశం. దేవుని కోసం ప్రత్యేకించుకోడానికి కూడ నూనె ఉపయోగించబడింది. ఒక స్థలం ప్రత్యేకించబడుట (అది.కా. 28:18; 31:13) మరియు యాజకులు (నిర్గ 29:7; లేవీ 8:12) వక్తలు (1 రాజు 19:16) రాజులు (1 సమూ 10:1; 1 రాజు 19:15) ప్రత్యేకించబడుటను లేఖనాల్లో గమనించవచ్చును. వీరు దేవుని చిత్తాన్ని నెరవేర్చడానికి ప్రత్యేకపరచుకొన్నారని అర్థం.

సంఘంలోని ఆత్మీయ నాయకులందరూ యాకోబు వ్రాసినట్లు ప్రార్థించవచ్చును. నీతి మంతుల ప్రార్థనలో ఎంత బలం వుందో ఏలియాను సాదృశ్యంగా తీసికొని వర్ణించాడు. (5:16,17)ను 1 రాజులు 17–18 అధ్యా. చదవండి). యాకోబు 5:16లో మరో ముఖ్యమైన విషయం వ్రాయబడింది. మన పాపాలను ఒకరితో ఒకరు ఒప్పుకోవాలా? మనుష్యులు మనకు పాపక్షమాపణ నివ్వరు కదా? దేవుడొక్కడే మన పాపాలను క్షమిస్తాడు. గనుక ఆయనతోనే ఒప్పుకోవాలి (1 యోహాను1:9) అయితే మనుష్యుల పట్ల మనం చేసిన తప్పులను వారితోనే ఒప్పుకోవాలి (లూకా 15:18). ఒప్పుకోని పాపాలు కూడ మన శ్రమలకు కారణమౌతాయి. రోగియైన విశ్వాసి, ఒకవేళ సంఘంలో ఎవరిపట్లనైనా తప్పు చేస్తే అతడు దాన్ని ఒప్పుకొని, సరిచేసుకోవడం ద్వారా దేవునిచే భౌతికంగాను, ఆధ్యాత్మికంగాను దీవించబడాలని ప్రోత్సాహించబడుతున్నాడు.

X. **ఆత్మల రక్షణ విశ్వాసిని పరిపక్వతనొందిస్తుంది (5:19, 20) :** ఈ మాటలు బహుశా తప్పిపోయిన విశ్వాసిని గూర్చి వ్రాయబడ్డాయని కొందరి అభిప్రాయమైనా, ఇంకా సత్యాన్ని ఎరుగని అవిశ్వాసులనుద్దేశించి వ్రాయబడ్డాయని కూడ తలంచవచ్చును. ఏది ఏమైనా ఒక వ్యక్తిని క్రీస్తును గూర్చిన అనుభవజ్ఞానములోనికి నడిపించినపుడు అతని పాపాలు ఎన్ని ఉన్నా, ఆయన రక్తంలో కప్పబడతాయన్నది సత్యం. విశ్వాసం ద్వారా నీతిమంతులుగా తీర్చబడే కార్యంలో, వారి పాపాలన్నీ క్షమించబడడమే కాక అవి వారి నుండి దూరపర్చబడతాయి. (కీర్త 103:12). వారిని ఈ ధన్యకరనమైన స్థితికి నడిపించే బాధ్యత ప్రతి విశ్వాసిపై మోపబడింది. ఒక ఆత్మను రక్షించుట వలన అతనిలో కలిగే గొప్ప ఆత్మ కార్యాన్ని, మనకు లభించే ప్రతిఫలాన్ని అర్థం చేసుకోగలిగితే తప్పకుండా హృదయంలో భారం అధికమౌతుంది.

అట్టి కృపను ప్రభువు మీకందరికి దయచేయును గాక!

**TTB - Telugu - Study Outlines - Books of Philemon, Hebrews & James**

Printed by : Premadhara, Trans World Radio - India, 12-1-334/17/3,
Lalapet, Secunderabad - 500 017. Ph : 040-27003011

**FREE** MP3 DOWN LOAD - Log on to : **www.radio882.com**